మన సమగ్ర ప్రజావాణి

RNI NO:TGTEL/25/A5443

తెలుగు డైలీ

MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY




| రాజన్న సిరిసిల్ల | శుక్రవారం | 15.05.2026 | సంపుటి : 01 | సంచిక : 129 | పేజీలు : 12 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| RAJANNA SIRICILLA | FRIDAY | 15.05.2026 | Volume : 01 | Issue : 129 | Pages : 12 | Cost : 2/- |

# నీట్-యూజీ2026 రద్దు...

# మోడీ సర్కార్ ఫెయిల్

- మోడీ హయాంలోనే 93 పేపర్లు లీక్
- ఆందోళనలో రెండు కోట్ల మంది విద్యార్థులు
- కేంద్రం తీరుపై ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ఆగ్రహం



**హైదరాబాద్,మే 14 :** నీట్-యూజీ2026 రద్దు... మోడీ ప్రభుత్వ నియంతృత్వ... నిరంకుశ నిర్ణయమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వఏకపక్షరద్దుతో యువత భవితవ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. గతపదేండ్లుగాప్రధాని మోడీ హయాంలో93పేపర్లు లీక్ అయ్యాయని ఆగ్రహంవ్యక్తం చేశారు. దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులు ఆందోళన చెందుతు న్నారని అన్నారు. పేపర్ లీక్ జరిగితే కనీసం సంబంధిత మంత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ముఖ్యమంత్రి విమర్శించారు. నీట్ రద్దు.. దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన పెద్ద నోట్ల రద్దు వంటిదేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత, నిర్లక్ష్యపూరితమైన ఈ నిర్ణయం దేశ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందన్నారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీక్‌లు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని చెప్పారు. తీవ్ర ఒత్తిడిలో సంవత్సరాల మిగతా2లో...

# కేరళ సీఎంగా వీడీ సతీశన్..

- ఎట్టకేలకు ప్రకటించిన కాంగ్రెస్
- 10 రోజుల ఉత్కంఠకు తెర
- 18న ప్రమాణ స్వీకారం
- వేణుగోపాల్ వర్గం అసంతృప్తి



**న్యూఢిల్లీ,మే 14 :** కేరళ తదుపరి ముఖ్యమంత్రిగా వీడీ సతీశన్ పేరును కాంగ్రెస్ పార్టీ గురువారం ప్రకటించింది. దీంతో గత కొన్ని రోజులుగా నెలకొన్న ఉత్కంఠ, ఊహాగానాలకు తెరపడింది. ముఖ్యమంత్రిగా ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన సతీశన్ ఎంపికను ఏఐసీసీ కేరళ ఇన్‌చార్జ్ దీపా దాస్‌మున్షీ, రాష్ట్రం కోసం పార్టీ నియమించిన కేంద్ర పరిశీలకులు అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్ విలేకరుల సమావేశంలో ప్రకటించారు. సతీశన్ ఈ నెల 18న మిగతా2లో...

## అల్పపీడనంతో కోస్తాంధ్ర, రాయలసమీాల్లో వర్షాలు

- 16 నాటికి అండమాన్‌లోకి నైరుతి ప్రవేశం



**విశాఖపట్నం,మే 14 :** నైరుతి బంగాళాఖాతం- పశ్చిమ మధ్య బంగాళాఖాతం సమీపంలో అల్పపీడనం కొనసాగుతోందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. మిగతా2లో...

## 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో

# సర్ ప్రక్రియ

- జాబితాలో ఉభయ తెలుగు రాష్ట్రాలు
- కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన




2లో

# స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు బుట్టదాఖలు

- రైతులను పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం
- జొన్న, మక్కలను రాష్ట్ర ప్రభుత్వమే కొంటోంది
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**భద్రాద్రి కొత్తగూడెం,మే 14 :** స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను కేంద్రప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం రైతులను మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. దళారుల దయాదాక్షిణ్యాలపై రైతులు ఆధారపడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కోసం మొక్కజొన్న, జొన్నలను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. కొనుగోళ్లతో రాష్ట్రంపై రూ.4 వేల కోట్ల అదనపు భారం పడుతోందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గురువారం మంత్రి తుమ్మలకు పామాయిల్ రైతులు ఆత్మీయ సత్కరం చేశారు. మంత్రిగా నలభై సంవత్సరాలు పూర్తి అయిన మిగతా2లో...



## చివరిగింజ వరకు

# కొంటాం

- మంత్రి ఉత్తమ్ హామీ
- పొంగులేటితో కలసి పాలేరు ధాన్యం కనుగోళ్లు పరిశీలన

**ఖమ్మం,మే 14 :** రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో వరి రైతులు ఎవరూ అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. గురువారం కూసుమంచి మండలం పాలేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. ట్రాన్స్‌పోర్ట్, హమాలీల విషయంలో కొంత ఇబ్బంది ఉందని చెప్పుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ఆ సమస్యను ప్రభుత్వం పరిష్కరింస్తోందని పేర్కొన్నారు. యాసంగిలో 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. బిహార్, మిగతా2లో...

## కెటిఆర్‌తో ఆస్ట్రేలియా

# హైకమిషన్ భేటీ

- కీలక అంశాలపై ఇరు నేతల చర్చలు



**హైదరాబాద్,మే 14 :** మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావుని భారతదేశంలోని ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్ కలిశారు. నందినగర్ నివాసంలో జరిగిన ఉన్నత స్థాయి భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఆస్ట్రేలియా హైకమిషనర్ ఫిలిప్ గ్రీన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల కాన్సుల్ జనరల్ హిల్లరీ మెక్‌గీచీతో సమావేశం అయ్యారు. పరస్పర ప్రయోజనాలు, వ్యూహాత్మక అంశాలపై విస్తృతంగా చర్చించారు. తెలుగు రాష్ట్రాల్లో ఆస్ట్రేలియా పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సాంకేతిక రంగంలో పరస్పర సహకారం, విద్యారంగంలో నూతన భాగస్వామ్యాల గురించి ప్రస్తావించారు.పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం మిగతా2లో...



## బండి భగీరథ్ బెయిల్

# పిటిషన్ విచారణ

- వారం రోజులకు వాయిదా వేసిన కోర్టు
- బెయిల్‌పై నేడు తీర్పు ఇవ్వనున్న హైకోర్టు

**హైదరాబాద్,మే 14 :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై హైదరాబాద్?లోని పేట్ బషీర్‌బాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం భగీరథ్ హైకోర్టును ఆశ్రయించాడు. గురువారం (మే 14) హైకోర్టులో ఈ పిటిషన్?పై విచారణ జరగగా.. భగీరథ్ తరుపున ప్రముఖ లాయర్ నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. వాదనాలు విన్న న్యాయస్థానం వారం రోజులకు వాయిదా వేసింది. మధ్యంతర బెయిల్ పిటిషన్?పై శుక్రవారం (మే 15) విచారణ మిగతా2లో...

## ఇంటర్ విద్యా విధానంలో

# మార్పులు

- ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్ పరీక్షలు
- మార్పులకు సిద్ధం అవుతున్న బోర్డు



**హైదరాబాద్,మే 14 :** ఇంటర్ విద్యా విధా నంలో తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి కీలక మార్పు లు చేపట్టేందుకు సిద్ధమైంది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్, కాన్సెప్ట్ ఆధారిత అభ్యాసం పెంచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసింది. కొత్త విధానంలో సైన్స్, మ్యాథ్స్, భాషా విభాగాల్లో పరీక్షల సరళి, మార్కుల విధానం, ప్రాక్టికల్స్ నిర్వహణలో కీలక మార్పులు చోటుచేసు కోనున్నాయి. ఇప్పటి వరకు ఇంటర్ సెకండియర్‌లో మాత్రమే ప్రాక్టికల్స్ నిర్వహించగా, కొత్త విధానంలో ఇంటర్ ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్ ప్రవేశపెట్టనున్నారు. మిగతా2లో...

## తాగునీటి పంపకాలపై కెఆర్ఎంబి ఉత్తర్వులు



**హైదరాబాద్,మే 14 :** రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదాల నేపథ్యంలో తాగునీటి పంపకాలపై కృష్ణానది యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) ఉత్త ర్వులు జారీ చేసింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల తాగు నీటి అవసరాలపై సమాలోచనలు చేసిన కెఆర్ఎంబి త్రిసభ్య కమిటీ ప్రస్తుత జలాశయాల్లో ఉన్న నిల్వలను, రెండు రాష్ట్రాల అవసరాలు, ఇప్పటికే జరిగిన వినియోగం మిగతా2లో...

## నీట్-యూజీ2026 రద్దు... మోడీ సర్కార్ ఫెయిల్

(మొదటి పేజీ తరువాయి)

తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కల్లలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతోమంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, కొంతమంది పేరెంట్స్ నగలు అమ్మి తమపిల్లలనునీట్ ఎగ్జామ్ కు ప్రిపేర్ చేయించారని... వారి ఆశలన్నీగల్లంతవడం బాధాకరమన్నారు. 2019 నుండి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయినా, ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. గుజరాత్ రాష్ట్రంలోనే 14 పేపర్లు లీక్ అయ్యాయన్నారు. 2014 మే నెలలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, భారతదేశంలోని ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో వ్యవస్థీకృత లోపాలు బహిర్గతమయ్యాయని చెప్పారు. కాంగ్రెస్ విడుదల చేసిన 'ది పేపర్ లీక్ డికేడ్' శ్వేతపత్రం ప్రకారం, కేంద్ర, రాష్ట్ర పరీక్షలలో 93 పేపర్ లీక్ ఘటనలుజరిగాయని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. వీటివల్ల సుమారు 2 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని చెప్పారు. 2024లో కేవలం ఎనిమిది వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు రద్దయ్యాయని తెలిపారు. నీట్-యూజీ (24 లక్షల మంది అభ్యర్థులు), యుజిసి-నెట్ (9 లక్షలు), సిఎస్ఐఆర్-నెట్, నీట్-పిజిరద్దుఅయినట్టు గుర్తు చేశారు. 2024లో ఉత్తరప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష (16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది అభ్యర్థులు) కూడా కొన్ని రోజుల్లోనే రద్దైందని, ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన లీక్‌లు జరిగాయన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఈ కుంభకోణాల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (తప్పుడు మార్గాల నివారణ) చట్టం'ను ఆమోదించినప్పటికీ, పెద్ద కుంభకోణాలు వెలుగు చూసిన తర్వాత, 2024 జూన్ వరకు దాని నోటిఫికేషన్‌ను కేంద్రం ఆలస్యం చేసిందన్నారు. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రిగా, విద్యార్థులకు, తల్లిదండ్రు లకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక హామీ ఇచ్చారు. నీట్రద్దునేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దనిభరోసానిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతి విద్యార్థికి, వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని హామీనిచ్చారు.

## ఇంటర్ విద్యా విధానంలో మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేకంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ విభాగాల్లో ఫస్టియర్ విద్యార్థులకు కూడా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. కొత్త విధానం ప్రకారం.. ఇంటర్ ఫస్టియర్‌లో, సెకండియర్‌లో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహించనుంది. దీంతో విద్యార్థులు కేవలం థియరీకే పరిమితం కాకుండా ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని కూడా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. మ్యాథమేటిక్స్ బోధనలోనూ కీలక మార్పులు తీసుకురానుంది. సంప్రదాయ పద్ధతికి బదులుగా యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను అమలు చేయనుంది. దీంతో విద్యార్థులు సూత్రాలను అర్థం చేసుకోవడం, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించుకోవడం, కాన్సెప్ట్ ఆధారిత విద్యనభ్యసించడం వంటి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం మ్యాథ్స్‌లో 75 మార్కులకు ౹÷నైల్ పరీక్ష నిర్వహిస్తుండగా, కొత్త విధానంలో దాన్ని 60 మార్కులకు తగ్గించనుంది. అదేవిధంగా యాక్టివిటీలు, ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు ప్రాధాన్యం పెంచే అవకాశం ఉంది.ఇప్పటివరకు ఇంటర్ పరీక్షలు 100 మార్కులకు నిర్వహించగా, ఇకపై వాటిని 80 మార్కులకు నిర్వహించనున్నట్లు సమాచారం. మిగిలిన మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రాక్టికల్స్, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ ద్వారా కేటాయించే అవకాశం ఉంది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ వంటి భాషా విభాగాల్లో 20 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు కేటాయించనుంది. ఇందులో ప్రాజెక్టులు సెమినార్లు, అసైన్‌మెంట్లు, క్లాస్‌రూమ్ పనితీరు ఆధారంగా మార్కులు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త విధానంతో విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి కొంతమేర తగ్గే అవకాశం ఉందని విద్యా నిపుణులు భావిస్తున్నారు. ఒక్క ౹÷నైల్ పరీక్ష ఆధారంగా కాకుండా, ఏడాది పొడవునా విద్యార్థుల పనితీరును అంచనా వేసే విధానం అమల్లోకి రానుంది. ఈ సంస్కరణలు జాతీయ విద్యా విధానం(ఔఇఖ)కు అనుగుణంగా తీసుకువస్తున్నట్లు సమాచారం. విద్యార్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా విద్యా నిపుణులు పేర్కొంటున్నారు. ఇంటర్ విద్యా విధానంలో వస్తున్న ఈ మార్పులు విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు బుట్టదాఖలు

(మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా తుమ్మలను సత్కరించారు. అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో మంత్రి తుమ్మల ఆత్మీయ సత్కార కార్యక్రమంలో పది ఉమ్మడి జిల్లాల పామాయిల్ రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడారు. పెరిగిన సాగు వ్యయాలకు ఎంఎస్‌పి సరిపోవని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పుకొచ్చారు. వరి ఎంఎస్‌పిని కేవలం 72శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వం పెంచిందని దుయ్యబట్టారు. మొక్కజొన్న పైనా మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. 10శాతం పెంపుతో రైతులకు న్యాయం జరగదని తెలిపారు. మద్దతు ధరలు కనీసం 30 నుంచి 40 శాతం వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎంఎస్‌పి ప్రకటించడం కాదని.. కొనుగోలు చేయడమే ముఖ్యమని తెలిపారు. ప్రతి పంటలో 75శాతం దిగుబడిని కేంద్రం కొనాలని డిమాండ్ చేశారు. మొక్కజొన్న, జొన్నలను ఖాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు.పత్తి, వేరుశనగ, సోయాబీన్ ఓ౼ూఖలపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల ఆదాయం పెంచే సంకల్పం కేంద్రానికి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పామాయిల్ సాగుకు దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు చేతుల మీదుగా శ్రీకారం చుట్టామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నలభై ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో పామాయిల్ సాగు విస్తరణకు ప్రాధాన్యం ఇచ్చానని ప్రస్తావించారు. అకాల వర్షాలతో ధాన్యం, మొక్కజొన్న రైతులు కష్టాలు పడుతున్నారని చెప్పుకొచ్చారు. ఆ సమస్యలు చూసిన వారు పామాయిల్ సాగు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థ విధానాల వల్లే తెలంగాణ రైతాంగం అవస్థలు పడుతోందని ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేంద్రం సహకరించకున్నా మద్దతు ధరకు పంటలు కొనే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ఉద్ఘాటించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతాంగం కోసం ఏడాదిలోనే లక్ష కోట్ల రూపాయలకుపైగా ఖర్చు పెట్టామని తెలిపారు. ఆదివాసీ బిడ్డలకు ఉద్యోగాలు దక్కేలా చంద్రబాబు జీఓ నంబర్ -3 తీసుకువచ్చారని ప్రస్తావించారు. నలభై ఏళ్ల క్రితం రైతాంగం కష్టాలు ఈ తరం వారికి లేవని చెప్పుకొచ్చారు. మారిన కాలానుగుణంగా అన్నదాతలు ప్రకృతి వైపరీత్యాలు, కోతుల బెడద, చీడ పీడలు లేకుండా పామాయిల్ సాగు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎందరో పోటీ పడ్డా ఎన్టీఆర్ వ్యవసాయ కళాశాల అశ్వారావుపేటకే ఇచ్చారని ప్రస్తావించారు. హార్టికల్చర్ హబ్‌గా అశ్వారావుపేట ఉందని వ్యాఖ్యానించారు. వ్యవసాయ కళాశాలకు తోడు ఉద్యాన కళాశాల అశ్వారావుపేట కు మణిహారమని ఉద్ఘాటించారు. చంద్రబాబు హెలికాప్టర్ నుంచి చూసి అశ్వారావుపేట పచ్చదనంపై ఆశ్చర్యపోయారని తెలిపారు. లక్షలాది రైతుల తలరాత మారేలా పామాయిల్ సాగు విస్తరణ చేసే అవకాశం భగవంతుడు తనకు ఇచ్చారని తెలిపారు. ఎన్ని పదవులు చేశామని కాదని.. ముందు తరాలకు మేలు చేసేలా తన రాజకీయ ప్రస్థానం ఉంటుందని ఉద్ఘాటించారు. మంత్రిగా నలభై ఏళ్ల ప్రస్థానంలో భద్రాద్రి శ్రీ రాముడు దయవల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి చేసే భాగ్యం దక్కిందని చెప్పుకొచ్చారు.

## అల్పపీడనంతో కోస్తాంధ్ర, రాయలసమీల్లో వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇదే ప్రాంతంలో సముద్ర మట్టానికి 5.9 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొన్నారు. దీని ప్రభావంతో రాగల 48 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ, యానాంలో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు, గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని తెలిపారు. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, ఈనెల 16 నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవులను తాకే అవకాశముందన్నారు. నైరుతి రుతుపవనాలు 16నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండ మాన్ నికోబార్ దీవుల ప్రాంతంలో ప్రవేశించే అవకా శం ఉన్నదని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. నైరుతి బంగా ళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం బుధవారం తీవ్ర అల్పపీడనంగా మారిందని పేర్కొన్నది. గురువా రం నుంచి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నదని వెల్లడించింది. 22 వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపుతాడని హెచ్చరించింది. గడిచిన 24 గంటల్లో నిజామాబాద్‌లో అత్యధికంగా 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా బీర్పూర్‌లో 44.4, కామారెడ్డి జిల్లా బిచ్కుందలో 44.2, సిద్దిపేట జిల్లా కోహెడలో 43.9, నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో 43.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమో దైనట్టు వివరించింది. వచ్చే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వడగాల్పులు ఎక్కువగా ఉంటా యని 11 గంటల తర్వాత బయటకు వెళ్లే సమయాల్లో తగిన జాగ్రత్తలు తీ సుకోవాలని సూచించింది. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఈ వారంపాటు జాగ్రత్తగా ఉండాలని కోరింది.



## డైవర్షన్ రాజకీయం షురూ.. ఫార్ములా ఈ కేసులో కేటీఆర్‌కు మళ్లీ నోటీసులు..!

**హైదరాబాద్,మే 14 :**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ అరెస్ట్‌కు డిమాండ్ చేస్తున్న బీఆర్ఎస్ పార్టీపై కక్ష సాధింపు చర్యలకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరతీసింది. బండి భగీరథ్‌పై 'పోక్సో' కేసు నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు రేవంత్ సర్కార్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మళ్లీ నోటీసులు పంపింది.పస లేని ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు జారీ చేసింది. కేటీఆర్‌తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డికి కోర్టు సమన్లు ఇచ్చింది. జూలై 31న విచారణకు హాజరవ్వాలని స్పష్టం చేసింది.

## ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

### - అధికారులకు సిఎం చంద్రబాబు ఆదేశం

**అమరావతి,మే 14** :2026-27 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని వివిధ శాఖలకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వివిధ శాఖలపై గురువారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్టేట్ ఓన్ రెవెన్యూస్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1,04,345 కోట్లుగా ఉంటే... 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 1,10,643 కోట్లుగా నమోదైందని వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ నుంచి రూ.33,679 కోట్లు, గనుల శాఖ నుంచి రూ. 10,300 కోట్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి రూ.11,047 కోట్ల మేర ఆదాయం వచ్చిందని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్టేట్ ఓన్ రెవెన్యూలో 6 శాతం వృద్ధి నమోదైందని సీఎం వివరించారు.

2026-27 ఆర్థిక సంవత్స రానికి రూ.1,27,506 కోట్ల మేర ఆదాయాన్ని లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుందని వెల్లడించారు.

గనులు, ఎక్సైజ్, స్టాంపులు రిజిస్ట్రేషన్, వాణిజ్య పన్నులు, రవాణా తదితర శాఖలు లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదాయంలో ప్రతీ రూపాయి సద్వినియోగం అయ్యేలా ప్రభుత్వ శాఖలు చూడాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు.ఈ సమీక్షకు సీఎస్ సాయిప్రసాద్, ఆర్థిక, రవాణా, ఎక్సైజ్, గనులు, స్టాంపులు రిజిస్ట్రేషన్, వాణిజ్య పన్నులు, అటవీ, పురపాలక శాఖల అధికారులు హాజరయ్యారు.

## కేరళ సీఎంగా వీడీ సతీశన్..

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నారు. ముఖ్యమంత్రి పదవి కోసం వీడీ సతీశన్, కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితల పోటీపడ్డారు. ఈ సందర్భంగా సతీశన్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించడంలో ఏఐసీసీ యత్నాలను సమన్వయం చేసి పార్టీ కార్యకలాపాలన్నింటికీ మద్దతు ఇచ్చిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు ధన్యవాదాలు తెలిపారు.ప్రచార కమిటీ చైర్మన్‌గా పనిచేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రమేశ్ చెన్నితలకు కూడా ఆయన ధన్యవాదాలు తెలిపారు. పార్టీ విజయంలో పోషించిన పాత్రను ప్రస్తుతిస్తూ ఆయన నా నాయకుడు కూడా అని అన్నారు. ముఖ్యమంత్రి పదవిని సాధించడంలో సహాయపడిన లక్షలాదిమంది పార్టీ కార్యకర్తలకు, యూడీఎఫ్ సంకీర్ణ భాగస్వాములకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తమ నాయకుడిని సీఎంగా ప్రకటించకపోవడంపై కేసీ వేణుగోపాల్ వర్గీయులు అసంతృప్తిని వ్యక్తం చేశారు.కాగా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దాదాపు 40 నిమిషాలపాటు సమావేశమైన మరుసటి రోజు కేరళ ముఖ్యమంత్రి ప్రకటన వెలువడింది. పార్టీ అధిష్టాన వర్గం చర్చలు పూర్తి చేసినట్లు బుధవారం కాంగ్రెస్ ప్రకటించింది. మే 4న కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ 140 స్థానాలకు గాను 102 స్థానాలను కైవసం చేసుకున్నప్పటి నుంచి కేరళ తదుపరి ముఖ్యమంత్రిపై నిర్ణయం పెండింగ్‌లో ఉంది. పార్టీ పరిశీలకులు మాకెన్, వాస్నిక్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కలిసి వారి అభిప్రాయాలను సేకరించిన తర్వాత కూడా రోజుల తరబడి అనిశ్చితి కొనసాగడంతో పార్టీ కేంద్ర నాయకత్వం విస్తృత సంప్రదింపులు జరిపింది.పార్టీ నాయకత్వం ఆ పదవికి పోటీపడుతున్న ముగ్గురు ప్రధాన అభ్యర్థులతోపాటు కేపీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌తో కూడా చర్చలు జరిపింది. సతీశన్, వేణుగోపాల్, చెన్నితలకు మద్దతు ఇచ్చే వర్గాల మధ్య అంతర్గత పోటీ కారణంగా కేరళలో కాంగ్రెస్ విజయం మరుగున పడింది. ముఖ్యమంత్రి పేరును ప్రకటించడంలో జరుగుతున్న జాప్యం పార్టీ కార్యకర్తలతోపాటు సంకీర్ణ భాగస్వామ్య పక్షాలలో కూడా ఆందోళన రేకెత్తించింది.

## 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో సర్ ప్రక్రియ

**న్యూఢిల్లీ,మే 14 :** దేశంలోని 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల 'ప్రత్యేక విస్తృత సవరణ' (సర్) మూడవ దశను ప్రారంభించనున్నట్లు భారత ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, లడఖ్ మినహా దేశం మొత్తం 'సర్' పరిధిలోకి వస్తుందని ఈసీ వెల్లడించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, పంజాబ్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు, దేశ రాజధాని ఢిల్లీ, చండీగఢ్, దాద్రా- నగర్ హవేలి-దమన్-దియు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మూడో దశ 'సర్' పక్రియ నిర్వహించనున్నారు. కాగా, 'సర్' మూడో దశలో భాగంగా 3.94 లక్షల మందికి పైగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు), జనాభా గణనకు రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల మంది బూత్ స్థాయి ఏజెంట్ల (బీఎల్ఏల) సహాయంతో ఇంటింటికి వెళ్లి 36.73 కోట్ల మంది ఓటర్ల వివరాలు తనిఖీ చేస్తారని ఈసీ తెలిపింది. మే 30 నుంచి అక్టోబర్ 14 వరకు 'సర్' మూడో దశ పక్రియ జరుగుతుందని పేర్కొంది. జూలై 5 నుంచి అక్టోబర్ 21 వరకు ముసాయిదా ఓటర్ల జాబితాల ప్రచురణ కొనసాగుతుందని ఈసీ వెల్లడించింది.

## తాగునీటి పంపకాలపై కెఆర్‌ఎంబి ఉత్తర్వులు

(మొదటి పేజీ తరువాయి)

వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని నీటి కేటాయింపులను ఖరారు చేసింది. మిగిలిన వేసవి కాలానికి సంబంధించి నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి తాగునీటి విడుదలపై ప్రధానంగా చర్చించింది. తాజాగా నీటి కేటాయింపులపై కృష్ణా యాజమాన్య బోర్డు తెలుగు రాష్ట్రాలకు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఆగస్టు 15వ తేదీ వరకు కేటాయింపులు జరపాలని ఈ ఉత్తర్వుల్లో పేర్కొంది.మొత్తం కేటాయింపులు 31 టిఎంసీలు కాగా, తెలంగాణకు నాగార్జునసాగర్ నుంచి 16 టిఎంసీలు, శ్రీశైలం నుంచి 4.5 టిఎంసీలు కలిపి మొత్తం 21 టిఎంసీలు, ఎపికి సాగర్ నుంచి 10 టిఎంసీల నీటిని విడుదల చేయాలని ఈ ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా, ప్రస్తుతం వేసవి తీవ్రతను పరిగణలోకి తీసుకున్న బోర్డు ఈ నీటిని కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే వాడాలని, సాగునీటికి మళ్లించకూడదని కెఆర్‌ఎంబి సూచించింది. శ్రీశైలం రిజర్వాయర్‌లో 810 అడుగుల వరకు అందుబాటులో ఉన్న నీటిని తెలంగాణ వాడుకోవచ్చని కెఆర్‌ఎంబి పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల తాగునీటి అవసరాల కోసం ఈ నీటిని కేటాయించాలని కెఆర్‌ఎంబిని గతంలో కోరింది.

## బండి భగీరథ్ బెయిల్ పిటిషన్ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

చేపడతామని పేర్కొంది. బాధితురాలు పుట్టిన రోజు డేట్స్?పై, గతంలో రాష్ డ్రైవింగ్ కేసులో అమ్మాయి మేజర్ అని పోలీసులు ఫైల్ చేసిన ఛార్జ్ షీట్ పట్ల పోలీసులు విచారణ జరపాలని హైకోర్టు ఆదేశించింది.నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. అయితే, ముందస్తు బెయిల్ వచ్చే వరకు అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఆదేశాలు ఇవ్వాలని భగీరథ్ తరుపు లాయర్ కోరగా.. మధ్యంతర బెయిల్‌పై శుక్రవారం (మే 15) విచారణ చేపడతామని హైకోర్టు స్పష్టం చేసింది.

## కెటిఆర్‌తో ఆస్ట్రేలియా హైకమిషన్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న కేటీఆర్‌తో ఈ అంశంలో అనేక అంశాలపై చర్చించారు. ఐటీ, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఇన్నోవేషన్ రంగాల్లో హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న అభివృద్ధిపై మాట్లాడారు. తెలంగాణ, ఆస్ట్రేలియా మధ్య సహకారం భవిష్యత్తులో స్థానిక యువతకు మరిన్ని అంతర్జాతీయ అవకాశాలను కల్పిస్తుందని కేటీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, ఆస్ట్రేలియా మధ్య ఉన్న దృఢమైన మైత్రిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే దిశగా తీసుకునే చర్యలపై చర్చించారు. ఆస్ట్రేలియా ప్రతినిధులతో జరిగిన ఈ భేటీపై సంతోషం వ్యక్తం చేశారు కేటీఆర్. ఈ భాగస్వామ్యం ఇరుదేశాల ఆర్థిక వ్యవస్థలకు, సాంస్కృతిక బంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

## చివరిగింజ వరకు కొంటాం

(మొదటి పేజీ తరువాయి)

పశ్చిమబెంగాల్ నుంచి ఎక్కువగా హమాలీలు తెలంగాణకు వస్తారని చెప్పుకొచ్చారు. ఇటీవలే పశ్చిమబెంగాల్‌లో ఎన్నికలు జరగడం వల్ల హమాలీల కొరత ఏర్పడిందని తెలిపారు. కేవలం ధాన్యం తరలించడానికి లారీలు, డీసీఎంలు ఏర్పాటు చేయాలని అన్నిజిల్లాల కలెక్టర్‌లకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు జారీచేశారు.



# అడ్మిషన్ల కోసం అసత్య ప్రచారాలు చేస్తున్న వాణి స్కూల్ యజమాన్యం...

● బిజెపి నేత మోలుమూరి శ్రీనివాస్.







**రామగిరి,మన సమగ్ర ప్రజావాణి మే 14:**రామగిరి మండలం సెంటినరీ కాలనీలో సింగరేణి యాజమాన్య సహకారంతో నిర్వహించబడుతున్న వాణి స్కూల్ యాజమాన్యం గత సంవత్సరం 2025 విద్యార్థులు సాధించిన మెరిట్ లిస్టు ఫ్లెక్సీ లపై ప్రదర్శించి ఈ సంవత్సరం 2026వ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన వాణి స్కూల్ యాజమాన్యం అని అసత్య ప్రచారం చేస్తూ కార్మికుల తల్లిదండ్రులను, సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజలను మోసం చేస్తూ అడ్మిషన్ల కోసం అసత్య ప్రచారం చేస్తుందని,ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 25% సీట్లు కేటాయించాలని నిబంధన ఉన్నా కూడా స్కూల్ యాజమాన్యం పట్టించుకోకుండా అత్యధిక ఫీజులు వసూలు చేస్తుందని బిజెపి నేత మాజీ, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మోలుమూరి శ్రీనివాస్ ఆరోపించారు. అంతేకాక స్కూలు యజమాన్యం పిల్లలకు ఉండవలసిన వసతులు,పిల్లలకు టాయిలెట్లు,గ్రౌండ్ ప్రహరీ ఏర్పాటు చేస్తామని చెప్పి ఇంతవరకు ఎలాంటి అభివృద్ధి చేపట్టలేదని స్కూల్లో సరైన అధ్యాపకులు లేరని,నామమాత్రంగా స్కూలు నిర్వహిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆయన అన్నారు. సింగరేణి మేనేజ్మెంట్ ఇట్టి విషయాలపై సమగ్ర విచారణ జరిపించి వాణి స్కూల్ లీజుని ఇతరులకు ఇచ్చి స్కూలు అభివృద్ధికి పాటుపడాలని, సింగరేణి యాజమాన్యమే చొరవ తీసుకొని సిబిఎస్ సి సిలబస్ ప్రారంభించాలని ఆయన అన్నారు. ఈ విషయాలు అన్నిటిపై సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్,సింగరేణి సి అండ్ ఎండీకి లిఖితపూర్వక ఫిర్యాదు చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తీగల శ్రీధర్,పరంకుశం చారి, మేరుగు శ్రీకాంత్,దొంతుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# చేతి పంపు మరమ్మతుతో నీటి సమస్యకు చెక్



**ప్రజావాణి సిర్పూర్ నియోజకవర్గం ప్రతినిధి నక్క సునీల్ కుమార్ మే 14:**కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టీ మండలంలో పారిగన్ గ్రామ ప్రజలు కొంతకాలంగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు గ్రామ సర్పంచ్ చక్కపూరే లావణ్య, ఉప సర్పంచ్ శారదా చొరవతో పరిష్కారం లభించింది. గ్రామంలో చాలా రోజులుగా పనిచేయకుండా నిరుపయోగంగా ఉన్న చేతి పంపును మరమ్మతు చేయించి తిరిగి వినియోగంలోకి తీసుకురావడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పలువురు కుటుంబాలు ఈ చేతి పంపుపైనే ఆధారపడి తాగునీటిని వినియోగించేవారు. అయితే సాంకేతిక సమస్యల కారణంగా చేతి పంపు నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు నీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వేసవి తీవ్రత పెరగడంతో సమస్య మరింత ఎక్కువైంది. ఈ విషయాన్ని గ్రామ ప్రజలు సర్పంచ్ చక్కపూరే లావణ్య, ఉప సర్పంచ్ శారదా దృష్టికి తీసుకెళ్లగా, వారు వెంటనే స్పందించి మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించి వెంటనే పరిష్కరిస్తున్న ప్రజాప్రతి నిధులు ఉండటం గ్రామానికి అదృష్టమని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాగే గ్రామ అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరుతూ సర్పంచ్, ఉప సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# ధరణి, సాదా బైనామా సమస్యలను భూ భారతి ద్వారా పరిష్కరిస్తాం

● ఏదులాపురం ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి







**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి :**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదాలతో ప్రజా ప్రభుత్వం మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిందని తెలిపారు. పేద ప్రజలకు అండగా నిలవడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లోనే అధికారులను ప్రజల వద్దకు పంపించి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కార చర్యలు చేపట్టామని తెలిపారు. రెండేళ్ల పాలన అనంతరం మళ్లీ ప్రజల వద్దకే అధికారులను పంపిస్తూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా, మున్సిపాలిటీని రెండు క్లస్టర్లుగా విభజించి ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 11 క్లస్టర్ల కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. ప్రతి దరఖాస్తుపై అధికారులకు పూర్తి జవాబుదారీతనం ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. కొన్ని సమస్యలను ఇక్కడికక్కడే పరిష్కరిస్తామని, మరికొన్ని సమస్యలకు కొంత సమయం పట్టవచ్చని తెలిపారు. అయితే ప్రతి అర్హత గల దరఖాస్తును నిబంధనల ప్రకారం మూడు నెలల్లోగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ, పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నిర్మిస్తున్నామని తెలిపారు. గురుకుల పాఠశాలల్లో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మొటిక్ ఛార్జీలను 200 శాతం పెంచామని చెప్పారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తూ, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు 500 బోనస్ కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్న ప్రభుత్వమిదేనని స్పష్టం చేశారు. గత పదేళ్లలో పేదలకు ఇళ్లు ఇవ్వలేదని, అయితే తమ ప్రభుత్వం తొలి దశలోనే లక్షలాది ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేస్తున్నామని చెప్పారు. జూన్ 2 నుంచి రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రారంభమవుతుందని, అనంతరం మూడవ, నాల్గవ విడత ఇళ్లను కూడా మంజూరు చేస్తామని వెల్లడించారు. ప్రతి అర్హులైన కుటుంబానికి ఇంటి నిర్మాణానికి 5 లక్షల సహాయం రాజకీయాలకు అతీతంగా అందిస్తామని స్పష్టం చేశారు. ప్రజాదర్బార్ కార్యక్రమాల్లో ఎక్కువగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు వస్తున్నాయని, గత ప్రభుత్వం ఇళ్లు నిర్మించకపోవడమే దీనికి కారణమని పేర్కొన్నారు. ప్రభుత్వం నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుండటంతో ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. ధరణి కారణంగా ఏర్పడిన భూ సమస్యలను భూ భారతి ద్వారా పరిష్కరిస్తున్నామని తెలిపారు. సాదా బైనామా దరఖాస్తులను కూడా ప్రభుత్వం అర్హత ప్రకారం పరిష్కరిస్తుందని చెప్పారు. త్వరలో పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా భూ సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు. నిరుద్యోగ యువతకు తొలి ఏడాదిలోనే 70 వేలకు పైగా ఉద్యోగాలు కల్పించామని మంత్రి తెలిపారు. పారదర్శకంగా పరీక్షలు నిర్వహించి ఎలాంటి లీకులు లేకుండా ప్రతిభావంతులైన అభ్యర్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో నిరుద్యోగ యువతకు మరిన్ని శుభవార్తలు అందిస్తామని తెలిపారు. జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఏదులాపురం మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మున్సిపాలిటీ పరిధిలో తొలి ప్రజాదర్బార్ కార్యక్రమమని తెలిపారు. ఇప్పటివరకు గ్రామాల వారీగా క్లస్టర్ స్థాయిలో ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహించామని, ఆ కార్యక్రమాల ద్వారా సుమారు 16 వేల దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తున్నామని, నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు జయలక్ష్మి, మమత మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం వచ్చాక తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని, ప్రస్తుతం సొంత ఇంట్లో ఆనందంగా జీవిస్తున్నామని తెలిపారు. అలాగే అర్హులైన పేద కుటుంబాలకు రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం వంటి పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ఈ పథకాల ద్వారా ప్రతి నెల సుమారు 4 వేల రూపాయల వరకు ఆదా అవుతోందని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ అనిత, వైస్ చైర్మన్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, మునిసిపల్ కమీషనర్, జిల్లా అధికారులు, వార్డ్ మెంబర్లు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాల్యమిత్రుని కూతురి పెళ్లికి ఆర్థిక సహాయం

● స్నేహానికి నిదర్శనంగా నిలిచిన చిన్ననాటి మిత్రులు.....





**గోదావరిఖని,మన సమగ్ర ప్రజావాణి మే 14:** చిన్ననాడు ఆటపాటలతో ఉల్లాసంగా చదువును కొనసాగించి,ఉద్యోగాలలో చేరి విధులు నిర్వహిస్తున్న సమయంలో విధి వక్రీకరించడంతో ముగ్గురు ఆడపిల్లలు గల ఆ తండ్రీ విగతజీవిగా మారిన క్రమంలో ఆ కుటుంబపు కలలు కళ్ళలైనాయి. ఇంటిపెద్ద కనుమరుగు కావడంతో ఇంటి బాధ్యతను తన భుజాన వేసుకుని ముగ్గురు ఆడపిల్లలను చదివించింది. ఆ ఇంటి ఇల్లాలు వివరాల్లోకి వెళితే.... గోదావరిఖని తిలక్ నగర్ లో నివాసముండే సానం రాజమౌళి అనారోగ్య కారణాల వలన చనిపోయాడు. అతనికి ముగ్గురు అమ్మాయిలు. అందులో ఒక అమ్మాయికి పెళ్లి సంబంధం కుదరటంతో వారి కుటుంబం చాలా పేదరికంలో ఉన్నందున బాల్య మిత్రులంతా స్పందించారు. పదవ తరగతి వరకు ఎనిమిదవ కాలనీ సింగరేణి స్కూల్ లో చదివిన 1985,86 బ్యాచ్ సంబంధించిన మిత్రులందరు కలిసి సానం రాజమౌళి అమ్మాయి పెళ్లికి 66500 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఆర్థిక సహాయం అందించిన వారిలో పోతరాజు రవి, అన్వర్,జాన్, శ్రీధర్,యాదగిరి,నారాయణ,సత్యనారాయణ,వెంకట్ రెడ్డి,సలీం,సుదర్శన్, మోహన్, ఎ తిరుపతి,రామలక్ష్మి,పద్మ ,ఎ. రాజయ్య,కె.రాజయ్య, కోటేష్,స్వర్ణ,సంగీత,కుసుమ లు ఉన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహణ..

● ఎంఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటకార్యక్రమం




**చింతలపాలెం మే 14 ప్రజావాణి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ సూచన మేరకు చింతలపాలెం జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఎంఈఓ శ్రీనివాస్ మరియు చింతలపాలెం మండల కేంద్రంలో నిర్వహించారు ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి పాల్గొని మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రతి విద్యార్థి విద్యను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారుఅలాగే తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ వేమూలూరి రంగచారి, షేక్ సొందు మియా , ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు, విఓఏలు, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఇల్లందకుంట పాఠశాలలో బడిబాట కార్యక్రమం

● గ్రామ సర్పంచ్ దార సురేష్, ఇల్లందకుంట మండల విద్యాధికారి కె. రాములు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తస్మిన్







**జమ్మికుంట మే 14( ప్రజావాణి):**ప్రభుత్వ ఆదేశానుసారం ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇల్లందకుంటలో పాఠశాల విద్య, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా పాల్గొన్న ఇల్లంతకుంట గ్రామ సర్పంచ్ దార సురేష్ ఇల్లందకుంట మండల విద్యాధికారి కే. రాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తస్నీమ్ నజ్మీన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. గోపి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇల్లందకుంట ప్రాథమిక పాఠశాల ఇల్లంతకుంట నుండి విద్యార్థులు ఉపాధ్యాయులచే భారీ ర్యాలీగా గ్రామపంచాయతీ కార్యాలయం ఇల్లంతకుంట వరకు వెళ్లడం జరిగినదిఇల్లందకుంట గ్రామ సర్పంచ్ దార సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైనటువంటి విద్యా అందిస్తున్నారని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరి నాణ్యమైనటువంటి విద్యను అభ్యసించాలని ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని మన ఇల్లందకుంట పాఠశాలలో సైన్స్ ల్యాబ్ కంప్యూటర్ ల్యాబ్ అధునాతనమైన ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డు ద్వారా విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నారని సుశిక్షితులైనటువంటి అనుభవజ్ఞులైనటువంటి ఉపాధ్యాయులచే విద్య బోధన చేయుచున్నారని బాలికా సంరక్షణ కొరకు కరాటే మరియు షీ టీం ద్వారా రక్షణ కల్పిస్తున్నారని 24 గంటల సీసీ కెమెరాలు ఆధ్వర్యంలో పాఠశాల నడుస్తుందని యోగ సంగీతం నృత్యం, చిత్రలేఖనము ఆటలు లాంటి బోధనేతర అభ్యసన ప్రక్రియలు కూడా ఉన్నాయని తెలిపారుజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తస్మిన్ నజ్మీన్ మాట్లాడుతూ పాఠశాలలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో బోధన జరుగుతున్నదని అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధన చేయుచున్నామని ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 47 మంది విద్యార్థులకు 47 మంది విద్యార్థులు 100% ఉత్తీర్ణులై పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం జరిగిందని అలాగే రానున్నటువంటి విద్యా సంవత్సరంలో కూడా విద్యార్థులందరికీ నాణ్యమైన బోధన అందించి పాఠశాలకు ఇల్లందకుంట గ్రామానికి మంచి పేరు తీసుకో రావడం జరుగుతుందని తెలిపారుఅలాగే ప్రభుత్వం అందిస్తున్న రుచికరమైన మధ్యాహ్న భోజనం ఉచిత పాఠ్యపుస్తకాలు ఉచిత నోటుబుక్కులు రెండు జతల యూనిఫాం 21 వస్తువులు కలిగిన ప్రతి విద్యార్థికి కిట్టుబాగ్ ఉదయము అల్పాహారము ఎస్ఎస్సి విద్యార్థులకు ఉదయము సాయంత్రము ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నామని తరగతులు నిర్వహిస్తున్నప్పుడు ప్రత్యేక అల్పాహారము అందిస్తున్నామని కావున గ్రామంలో పరిసర గ్రామాల విద్యార్థులను ఇల్లందకుంట ఉన్నత పాఠశాలలో చేర్పించి విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడగలరని కోరారుఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇల్లందకుంట గ్రామ సర్పంచి దార సురేష్, ఇల్లందకుంట మండల విద్యాధికారి కె. రాములు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తస్మిన్ నజ్మీన్ ఉపాధ్యాయులు కే. జయప్రకాష్ సిహెచ్. వేణు ఎం. సమ్మిరెడ్డి జి. అన్నపూర్ణ కే. సత్యం ఏ. సురేష్, సిహెచ్. రామకృష్ణ కే శంకర్, ఎం. ఐలయ్య, ఎస్ సంపత్ కె. వీరస్వామి వరలక్ష్మి సతీష్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్క ఉపాధి హామీ కూలికి EKYC తప్పనిసరి,..

● బూర్గంపాడు ఎంపీడీవో జమలారెడ్డి..



**బూర్గంపహాడ్ / మన ప్రజావాణి / గురువారం /మే14,.**బూర్గంపాడు మండలంలోని జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఈ కేవైసీ చేయించుకోవాలని, లేని పక్షంలో జాబ్ కార్డులో పేరు తొలగిపోతుందాని బూర్గంపహాడ్ ఎంపీడీఓ జమాలరెడ్డి అన్నారు. బూర్గంపాడు మండలంలోని అన్ని గ్రామాల్లో తిరుగుతూ ఎంపీడీఓ గారు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు . బుధవారం ఎంపీడీఓ బూర్గంపాడు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో తిరుగుతూ ఉపాధి కూలీలకు స్వయంగా ఎంపీడీఓ జామలారెడ్డి గారు ఈ కేవైసీ చేశారు. జాబ్ కార్డు ఉన్న వ్యక్తి మాత్రమే పనులకు వచ్చేలా చూడడానికి, ఈ కేవైసీ తప్పనిసరి అని ఎంపీడీఓ జమాలరెడ్డి గారు అన్నారు. ఆధార్ తో అనుసంధానం చెయ్యడం ద్వారా ఈ కేవైసీ సేకరిస్తున్నామని, ఉపాధి హామీ కూలీలు తమ సమీప , గ్రామపంచాయతీ లేదా ఫీల్డ్ అసిస్టెంట్ FA ద్వారా EKYC అప్డేట్ చేసుకోవాలని ఎంపీడీవో జమలరెడ్డి గారు అన్నారు. దీనికోసం ముఖ గుర్తింపు (ఫేసియల్ రికగ్నేషన్ ) యాప్ ఉపయోగిస్తున్నట్లు కొత్త నిబంధన ప్రకారం , ఈ కేవైసీ లేని ఉపాధి హామీ కూలీలకు పనులు చేసిన వేతనాలు రాకపోవచ్చు అని అన్నారు. కాబట్టి ప్రతి ఒక్క ఉపాధి హామీ కూలీ తప్పనిసరిగా ఈ కేవైసీ చేసుకోవాలని బుర్గంపాడు ఎంపీడీవో జమలారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మంద నాగరాజు , ఉపాధి హామీ సిబ్బంది టీఏలు , ఫీల్డ్ అసిస్టెంట్లు మరియు మె ట్లు పాల్గొన్నారు

## సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని రైతుసంగం డిమాండ్

● సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేత



**చింతలపాలెం మే 14 ప్రజావాణి :** మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం నందుప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలకమండళ్లను నియమించడాన్ని తెలంగాణ రైతుసంగం ( ఏ ఐ కె ఎస్ ) వ్యతిరేకించింది. రాష్ట్రంలోని 908 సహకార సంఘాలకు రాజకీయ నియామకాలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 జెడ్ హెచ్ ప్రకారం సహకార సంఘాలకు తప్పనిసరిగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సిహెచ్ రవి, షేక్ బాషా, నాగేశ్వరరావు,మైబు సాహెబ్ గంధం మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహణ



**చింతలపాలెం మే 14 ప్రజావాణి :**చింతలపాలెం మండలంలోని గుడిమల్కాపురం గ్రామపంచాయతీ పరిధిలో గల ఎం పి యు పి ఎస్ పాఠశాలలో ఈరోజు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపసర్పంచ్ మేడిశెట్టి నరసింహారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ పోలినేడి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెరగాలని, గత విద్యా సంవత్సరంతో పోలిస్తే కనీసం 10 శాతం తగ్గకుండా విద్యార్థులు చేరేలా కృషి చేయాలని అన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలనువినియోగించుకోవాలని సూచించారు .ప్రభుత్వపాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎంతో ప్రతిభావంతులని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య పెరగడానికి ప్రజాప్రతినిధు లు, తల్లిదండ్రులు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొల్ల రాంబాబు, చింతారెడ్డి చిలకారెడ్డి, గల్లా శ్రీనివాసరావు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎండల్లో మజ్జిగ పంపిణీ చేసి సేవా భావం చాటిన హెచ్ఎన్ఎస్ బ్రదర్స్



**గరిడేపల్లి ప్రజావాణి మే 14:** మండల పరిధిలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలకు మండు టెండల్లో ఉపశమనం కలిగించేందుకు హెచ్ఎన్ఎస్ బ్రదర్స్ ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. ఉపాధి కూలీలకు బిఆర్ఎస్ పార్టీ గిరిజన నాయకులు, హుజూర్నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుగులోతు నీలా హేమ్లా నాయక్ పాల్గొని కూలీలకు స్వయంగా మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు జీవనాధారంగా మారిందన్నారు. ఎండలను లెక్కచేయకుండా కష్టపడి పనిచేస్తున్న కూలీల ఆరోగ్యం కాపాడటం సమాజ బాధ్యత అని తెలిపారు. కూలీల సంక్షేమం కోసం భవిష్యత్తులో హెచ్ఎన్ఎస్ బ్రదర్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో పనిచేస్తున్న కూలీలకు తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రథమ చికిత్స సదుపాయాలు ఎండ తీవ్రత దృష్ట్యా కూలీల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ బ్రదర్స్ సామాజికవేత్త గుగులోతు నరేందర్ నాయక్, పులియా నాయక్, బానోతు రవీందర్ నాయక్, నెహ్రూ నాయక్, నాగు నాయక్, వెంకట్రాం నాయక్, బానోతు లలిత రవీందర్ నాయక్, నందా నాయక్, బుల్బాయి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం ప్రాజెక్టు కాలనీ నిరుపేదలపై రెవెన్యూ అధికారుల వేధింపులు తగదు: సమస్యను పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ, సిపిఐ హెచ్చరిక




**నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్ట్ మే 14 (ప్రజావాణి):**శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న సామాన్య, నిరుపేద ప్రజలకు రెవెన్యూ శాఖ అధికారులు నోటీసులు జారీ చేయడంపై ఏఐటీయూసీ (AITUC), సిపిఐ (CPI) ఆధ్వర్యంలో నిరసన గళం విప్పారు. శ్రీశైలం ప్రాజెక్టు AITUC ప్రధాన కార్యదర్శి కె. నాగిరెడ్డి గారి ఆధ్వర్యంలో నేడు కాలనీ ప్రజలందరూ ఏకమై, అధికారుల నోటీసులకు వ్యతిరేకంగా తమ సంతకాలతో కూడిన వివరణ పత్రాలను మూకుమ్మడిగా అందజేశారు. ఈ సందర్భంగా కె. నాగిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్న పేదలను నోటీసులతో భయపెట్టడం దుర్మార్గమని, తక్షణమే ఈ సమస్యను పరిష్కరించి పేదలకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. అధికారులు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ఏఐటీయూసీ, సిపిఐ నాయకత్వంలో ప్రజలందరినీ ఐక్యం చేసి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సిపిఐ నాయకులు మరియు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదల పెన్నిధి.. పిల్లుట్ల రఘున్న



**గరిడేపల్లి ప్రజావాణి మే 14:**పేదరికం బిడ్డ పెళ్లికి అడ్డంకి కాకూడదని.. గరిడెపల్లి మండల పరి ది లోని లక్ష్మితండ కు చెండినా వాంకుడోత్ సైదా నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన పిల్లుట్ల రఘు అన్న సైదా కుమార్తె వివాహానికి హాజరై, పట్టు వస్త్రాలు, పసుపు కుంకుమలు, వెండి మెట్టెలతో పాటు ?5,000 ఆర్థిక సహాయం అందించి తన ఉదారతను చాటుకున్నారు. ఆపదలో ఉన్నవారికి నేనున్నానని భరోసా ఇచ్చే రఘు అన్న నిజమైన ప్రజా నాయకుడు. ఈ కార్యక్రమములో మాజి మండల యువజన అద్యక్షులు మండవ నాగేశ్వర్రావు గౌడ్ గ్రామ సర్పంచ్ వాంకుడోతు శారద రవి గ్రామశాఖ అద్యక్షులు వాంకుడోతు యల్లయ్య యూత్ అద్యక్షులు వాంకుడోతు బిక్షం నాయకులు కార్యకర్తలు రఘున్న అభిమానులు పాల్గొన్నారు

# ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా

■ నామినేటెడ్ పాలక మండళ్లను నియమించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం
■ రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలన్నిటికి వెంటనే ఎన్నికలను నిర్వహించాలి.
■ రైతు సంఘం డిమాండ్




**గరిడేపల్లి ప్రజావాణి మే 14:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా తమ పార్టీ కార్యకర్తలను పాలకవర్గ సభ్యులుగా నామినేటెడ్ చేయటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నామినేటెడ్ పాలకవర్గాలను ప్రభుత్వం నియమించడానికి వ్యతిరేకంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గరిడేపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం తాసిల్దార్ స్రవంతి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పడిన నాటి నుండి కూడా ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలను నిర్వహించి, ఎన్నికైన పాలక మండలి సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని,దానికి విరుద్ధంగా ప్రస్తుత ప్రభుత్వం తమ పార్టీ కార్యకర్తలను పాలకవర్గ సభ్యులుగా నామినేట్ చేయడం ఏమాత్రం భావ్యం కాదని,ఇది రాజ్యాంగ విరుద్ధమని,కోర్టులలో కూడా చెల్లదని, కావున రాష్ట్రంలో అధికారం లో వున్న ప్రభుత్వం వెంటనే నామినేటెడ్ చేసిన పాలక మండళ్లను వెంటనే రద్దు చేసి,ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలను నిర్వహించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమం లో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి త్రిపురం సుధాకర్ రెడ్డి,సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఎల్ల అంజన్ రెడ్డి, మండల రైతు సంఘం నాయకులు పోకల ఆంజనేయులు, అంబటి వెంకటరెడ్డి , షేక్ నబి సాబ్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎడవల్లి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు తాళ్ల తిరుపయ్య,ఏఐవైఎఫ్ నాయకులు పంగ సైదులు, షేక్ సైదా,కీసర కోటమ్మ, కీసర నాగమణి,తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేస్తాం

● రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి :**రైతులు పండించిన ప్రతి గింజ ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ - సెర్ప్ ద్వారా శ్రీ లక్ష్మి గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతుల నుంచి ధాన్యం సేకరణ, తూకం, నాణ్యత ప్రమాణాలు, నిల్వ ఏర్పాట్లు తదితర అంశాలను మంత్రులు పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. లి ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల విషయంలో పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులు పండించిన చివరి గింజ వరకూ మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. లి ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం 22 వేల కోట్లతో ఈ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 82 నుంచి 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం హమాలీలు, లారీ వాహనాల కొరత వంటి సమస్యలు ఉన్నాయని మంత్రి తెలిపారు. సాధారణంగా బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి హమాలీలు వస్తారని, ఇటీవల పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు, బీహార్‌లో వ్యవసాయ సీజన్ పొడిగింపు కారణంగా హమాలీల కొరత తీవ్రంగా ఉందన్నారు. లి అయినప్పటికీ ప్రభుత్వం ఆ సమస్య పరిష్కారానికి అత్యవసర చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. రవాణా సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. వచ్చే 15 రోజుల పాటు లారీలు, డీసీఎంలను ఇతర అవసరాలకు కాకుండా ధాన్యం రవాణాకే వినియోగించాలని నిర్ణయించామని చెప్పారు. ధాన్యం రవాణాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంత్రులు జిల్లాల వారీగా పర్యటిస్తూ కొనుగోళ్ల ప్రక్రియను సమీక్షిస్తున్నారని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి, డిఆర్డిఓ శ్రీరామ్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ. అలీం, ఇంచార్జ్ డిఎం సివిల్ సప్లై సునీల్ రెడ్డి, డిసిఓ గంగాధర్, సెంటర్ ఇంచార్జ్ రేణుక, ఏఈఓ, సంబంధిత అధికారులు, రైతులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం పేదల పక్షమా... కేంద్ర హోంమంత్రి బండి సంజయ్ పక్షమా...

**కమాన్ పూర్,మన సమగ్ర ప్రజావాణి మే 14.**రాష్ట్ర ప్రభుత్వం పేదల పక్షమా లేక కేంద్ర మంత్రి బిఎస్పీ నాయకులు ప్రశ్నించారు. గురువారం కమాన్ పూర్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ....మైనర్ అమ్మాయిపై అత్యాచారాచానికి పాల్పడిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ ను కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ బండి భగీరథ్ ను అరెస్ట్ చేయని పక్షంలో ఊరురా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షమా...., డబ్బునోళ్ళ పక్షమా..., అధికార బీజేపీ పక్షమా.... అనీ స్పష్టంగా గ్రామాల్లో ప్రచారం చేస్తామని హెచ్చరించారు. అట్లాగే బండి భగీరథ్ ను అరెస్ట్ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షం అనీ నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం బండి సంజయ్ కుమారున్ని కాపాడితే ప్రజలే బుద్ధి చెప్తారని,అదేవిధంగా కవిత నిన్న మీడియా మిత్రులతో మాట్లాడుతూ.. బండి భగీరత్ రాజకీయ నాయకుడు కాదు పసిపిల్లగాడు తనను రాజకీయంలోకి లాగాకూడదు అంటూ చేసిన వాక్యాలు చాలా బాధాకరమైన విషయమని,కవిత మీకు కూడా ఒక కూతురు ఉండుంటే తనపై లైంగిక దాడి జరిగి ఉంటే ఇలాగే మాట్లాడేవారా దిశా లైంగిక దాడి విషయంలో నలుగురిపై కాల్పులు జరిపి చంపిన విషయం అందరికీ తెలిసినదే అగ్రవర్ణాలకు ఒక న్యాయం బీసీలకు ఒక న్యాయమా ఉరుకునేదే లేదు వెంటనే బండి భగీరథ ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచాలని బహుజన్ సమాజ్ పార్టీ డిమాండ్ చేశారు. ఈ ప్రెస్ మీట్ లో కమాన్ పూర్ మండల అధ్యక్షుడు నాస్తిక్ రాంషాన్, ఉపాధ్యక్షుడు గజ్జల సురేష్,పులిపాక సాగర్ పాల్గొన్నారు.




# రైస్ మిల్ దుమ్ము.. ఆయిల్ మిల్ వాసనతో వాహనదారులకు నరకయాతన

● బెజ్జంకి క్రాసింగ్--గుగ్గిళ్ల గ్రామ రహదారిపై పెరుగుతున్న కాలుష్యం

**బెజ్జంకి, మే 14 (ప్రజావాణి):**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని బెజ్జంకి క్రాసింగ్ నుండి గుగ్గిళ్ల గ్రామానికి వెళ్లే రహదారిపై దుమ్ము సమస్య తీవ్రరూపం దాల్చింది. రహదారి పక్కనే ఉన్న రైస్ మిల్, ఆయిల్ మిల్‌ల నుండి వెలువడుతున్న పొడి దుమ్ము, పొగ, దుర్వాసనలతో ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకంగా ద్విచక్ర వాహనదారులు దుమ్ము కారణంగా కళ్లలో మంటలు, శ్వాస సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము అధికంగా గాలిలోకి ఎగరడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం పెరిగిందని తెలిపారు. ఈ యొక్క దుమ్ము వల్ల ఇప్పటికే పలువురు వాహనదారులు కిందపడిన ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. రైస్ మిల్, ఆయిల్ మిల్‌ల నుండి వెలువడుతున్న దుమ్ము, వాసనలను నియంత్రించేలా సంబంధిత అధికారులు, గుగ్గిళ్ల గ్రామ సర్పంచ్ ప్రత్యేక చొరవ తీసుకొని వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి గ్రామ ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు, వాహన దారులు కోరుతున్నారు.

# అర్ధగిరి స్వామివారి సన్నిధిలో జిల్లా కలెక్టర్

**● అరగొండలో ఉపాధి హామీ పనులు తనిఖీ.**

**తవణంపల్లి మే 14 ప్రజావాణి :** తవణంపల్లి మండలంలోని అరగొండలో అరగొండలో శ్రీ అర్ధగిరి వీరాంజనేయ స్వామి దేవస్థానం ను చిత్తూరు జిల్లా కలెక్టర్ శ్రీ సుమిత్ కుమార్ సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్, ఈవో మునిశేఖర్, మరియు సిబ్బందులు కలిసి ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అర్ధగిరి నుండి నేరుగా అరగొండ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం, ఖండిత కందకాలు పనులను తనిఖీ చేశారు. అలాగే పని చేస్తున్న వేతనదారులకు మజ్జిగ మరియు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను ఆయన చేతుల మీదుగా పంపిణీ పంపిణీ చేయడం జరిగింది. వేతన దారులతో మాట్లాడుతూ రోజువారి సగటు వేతనం 300 రూపాయలు వరకు



అందుతున్నదని అడిగి తెలుసుకున్నారు. జలధార కార్యక్రమం పథకం కింద ప్రతి జాబ్ కార్డు కలిగి ఉన్న కుటుంబానికి పని కల్పించాలని, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు పథక సంచాలకులు మల్లికార్జున,



సహాయ పతక సంచాలకులు సుబ్రహ్మణ్యం, తవణంపల్లి ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, ఏపీ బాల,ఈసీ రమ్య, ఉపాధి హామీ పథకం సిబ్బందులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐఏటీసి లో విద్యార్థుల ప్రవేశాలకు పోస్టర్ ఆవిష్కరణ

**● మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్**



**జమ్మికుంట మే 14 (ప్రజావాణి):** కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐ,ఏటీసీల్లో విద్యార్థులకు ప్రవేశల పోస్టర్ విడుదల చేసిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్.కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐఏటీసి లో విద్యార్థుల ప్రవేశాలు పోస్టర్ విడుదల చేసిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ ప్రైవేట్ ఐటీఐలతో పాటు ప్రభుత్వ ఏటీసీల్లో అర్హులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు కరీంనగర్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ కె.అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారని కరీంనగర్ లోని ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రిషియన్, కంప్యూటల్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రెస్ మేకింగ్,వెల్డర్,మెకానిక్ ఆటో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఐవోటీ టెక్నిషియన్ స్మార్ట్ అగ్రి కల్చర్, వర్చువల్ ఎనాలసిస్ అండ్ డిజైనర్,మెకానిక్ ఎలక్ట్రిక్ వెహి కల్, అడ్వాన్స్డ్ సీఎస్సీ టెక్నీషి యన్, మ్యానుఫాక్చరింగ్ ప్రాసెసింగ్ ఆటోమెషన్ కంట్రోల్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్లో, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్ ప్రవే శాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్లైన్లో ద్వారా రూ.100 చెల్లించి దరఖాస్తు లను వచ్చే నెల 8వ తేదీలోపు చేసుకోవాలనిఎస్ ఎస్ సి అని తెలిపారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు..

# ఎన్.టి.ఏ ను రద్దు చేయాలి..

- నీట్ అభ్యర్థులకు న్యాయం చేయాలి
- నీట్ పేపర్ లీక్ కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు.
- ఎస్.ఎఫ్. ఐ డిమాండ్
- ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చాకలి అనిల్



**ప్రజా వాణి,వికారాబాద్ జిల్లా,మే 14:** భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నీట్ పేపర్ లీకేజీ,అవినీతి మరియు పరీక్షల నిర్వహణలో జరిగిన ఘోర వైఫల్యాలకు నిరసనగా కేంద్ర ప్రభుత్వం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ, ఎన్ టీ ఏ,ను వెంటనే రద్దు చేయాలని.ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చాకలి అనిల్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా చాకలి అనిల్ మాట్లాడుతూ మే మూడవ తేదీన జరిగిన నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ తో రద్దు చేస్తున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్.టి.ఎ)ప్రకటించడం ఎన్ టి ఏ యొక్క అసమర్ధత బట్టబయలు అయిందని ఒకే దేశం ఒకే పరీక్ష ఓ విఫల ప్రయత్నమని.22 లక్షల కు పైగా నీటి పరీక్ష రాసిన అభ్యర్థుల జీవితాలు నీట్ రద్దుతో అంధకారంలోకి వెళ్లాలని దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని అలాగే సెంట్రలైజ్డ్ పరీక్షల విధానం మరియు ఎన్.టి.ఎ ను రద్దుచేసి రాష్ట్ర ప్రభుత్వాలే మెడికల్ ఎంట్రెన్స్ టెస్టను నిర్వహించుకునే విధంగా చేయాలని అలాగే నీట్ అభ్యర్థుల నుండి ఎలాంటి రుసుము వసూలు చేయకుండా పరీక్షకు అనుమతించాలని డిమాండ్ చేశారు లక్షల రూపాయలు ఫీజులు కట్టి నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని.వారికి రెండు సంవత్సరాల పాటు ఉచిత శిక్షణ ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# గిరిజన ఆడబిడ్డ పెండ్లికి మేనమామగా పిల్లుట్ల రఘు

**● బిఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు**

**గరిడేపల్లి ప్రజావాణి మే 14** గరిడేపల్లి మండల పరిధిలో ఉన్న. లుంబతండ గ్రామానికి చెందినగుగులోతు రవీందర్ నాయక్ కుమార్తె గుగులోత్ సౌజన్య సేవా నాయక్ వివాహవేడుకలో సొంత మేనమామల ముఖ్యఅతిథిగా హుజూర్నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు



పిల్లుట్ల రఘు మాజీ మండల పార్టీ అధ్యక్షులు గుగులోతు కృష్ణ నాయక్ తో కలిసిపాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి పిల్లుట్ల రఘు పెళ్లి కానుకగా వధూవరులను పట్టు వస్త్రాలు మరియు మెట్టెలు మరియు పెళ్లి సామాగ్రి అందజేసి వారిని ఆశీర్వదించారు పిల్లుట్ల రఘు ఒక రాజకీయ నాయకుడే కాకుండా ఒక సామాజిక సేవాకర్తగా అన్ని కార్యక్రమాలు చేస్తానని పేద ప్రజలు ఎక్కడున్నా నేనున్నానని ధైర్యం ఇస్తూ ప్రతి సమస్యను నా ఇంటి సమస్యగా పరిష్కరిస్తారని వారు చెప్పినారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు గుగులోతు కృష్ణ నాయక్ శీతల తండా గ్రామ శాఖ అధ్యక్షులు రాంబాబు నాయక్ బిఆర్ఎస్ నాయకులు బాలు నాయక్ ఫుల్ సింగ్ నాగరాజు నాయక్ శ్రీను నాయక్ బాలాజీ నాయక్ సతీష్ నాయక్ కుమార్ అఖిల్ నరసింహ నాయక్ చరణ్ గణేష్ వెంకట్రాశీతదితరులు పాల్గొన్నారు

# ఆసరా పెన్షన్ల ఆశలపై నీళ్లు...

- కొత్తవి అసలే రావు..పాతవి పెరిగే అవకాశాలు లేవు.
- ఆసరా కోసం లబ్దిదారుల ఎదురుచూపులు.
- 25 లక్షల పైగా దరఖాస్తులు పెండింగ్.
- రెండెండ్లలో 2 లక్షల పెన్షన్లు రద్దు.
- ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న దరఖాస్తుదారులు పట్టించుకోని అధికారులు

**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 14:** రాష్ట్రంలో ఆసరా పింఛన్ల కోసం రెండేండ్లుగా పేదలు ఎదురు చూస్తున్నారు. కొత్తవి రావడం లేదు. పాత పింఛన్లు పెంచడం లేదు , కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు దాటిన ఆసరా చేయూత ముందుకు సాగట్లేదు. ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి మేనిఫెస్టోలో పెట్టి వచ్చే నెల నుంచి పింఛన్లు పెంచు తామని ప్రకటించింది. ప్రజా పాలన ద్వారా 2024-25 రెండు దఫాలుగా కొత్తగా 24.95 లక్షల దరఖాస్తులను స్వీకరించారు. వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటి వరకు అర్హులను ఎందుకు ఎంపిక చేయలేదు. పాత పింఛన్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఆసరా వికలాంగుల పింఛన్లను





రూ. 6.016 కు , మిగతా పింఛన్లు రూ. 4,016 లకు పెంచాలి. అధికారంలోకి వచ్చి రెండెడ్లు గడుస్తున్నా సర్కార్ తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది.

ఆదాయ పరిమితి పేరిట పింఛన్లను తగ్గిస్తే సహించేది లేదు..

పెంపు కొత్త పింఛన్ల మంజూరు ఇప్పటి వరకు జరగలేదు. దరఖాస్తు దారులు కాళ్లరి గేలా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వివిధ



కారణాలతో దాదాపు రెండు లక్షల పింఛన్లు రద్దు చేశారు. 2023-24 ప్రకారం 44,49,767 మంది ఆసరా పింఛన్ దారులు ఉన్నారు. వికలాంగులు , వృద్ధులు , వితంతువులు , వ్యాధి గ్రస్తులు , గీత , చేనేత , బీడి కార్మికులు ఇలా చాలా మంది ఉన్నారు. జీవో నం. 17 ను తెరపైకి తెచ్చి ఆదాయ పరిమితి పేరిట పింఛన్లను తగ్గిస్తే సహించేది లేదని అర్హులైన వారందరికీ ఆసరా పింఛన్లను ఇవ్వాల్సిందే అని భువనగిరి మండల బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు టి యు డబ్ల్యూ జే రాష్ట్ర కార్యదర్శి గుండు ముత్తయ్య గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# పత్తిపాకలో ఘనంగా “బడిబాట”కార్యక్రమం



**ప్రజావాణి శాయంపేట :** మండలం పత్తిపాక గ్రామంలో గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ గజ్జి ఐలయ్య ఉపసర్పంచ్ తుడుం రాజు హాజరై వారు మాట్లాడుతూ గ్రామంలోని తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ప్రైవేట్ పాఠశాలలకు పంపించి వేల ఫీజులు కట్టి అప్పుల పాలు కావద్దని మన ఊరి బడిని మనమే కాపాడుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్స్ రమేష్ ప్రధానోపాధ్యాయులు మాధవి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు అనిత, విజయ,సోంబాబు రఘు, విజయ్, శ్రీనివాస్, అంజని, చానుపాషా, కిరణ్మయి విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు

# చట్టం ఎవరికి చుట్టం కాదు

**● బండి సంజయ్పై విమర్శలు సరికావు రాజకీయ కక్షతోనే ఆరోపణలు**

**బిజెపి నాయకులు లాడే శివ**

**ప్రజావాణి శాయంపేట :** చట్టం ఎవరికి చుట్టం కాదని నమ్మే నాయకుడు బండి సంజయ్ అని, అలాంటి వ్యక్తిని విమర్శించడం భావ్యం కాదని బీజేపీ నాయకుడు లాడే శివ పేర్కొన్నారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.లాడే శివ మాట్లాడుతూ, బండి సంజయ్ ఎదుగుదలను ఓర్వలేని కొందరు పనిగట్టుకుని విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయనను నేరుగా ఎదుర్కోలేని



వారు కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కోర్టు ఎవరినీ దోషిగా తేల్చకముందే రాజకీయ కక్షతో విమర్శలు చేయడం సరికాదన్నారు. ఒకవేళ ఎవరైనా తప్పు చేసి ఉంటే చట్ట ప్రకారమే చర్యలు తీసుకోవాలని, చట్టం ముందు అందరూ సమానమేనని తెలిపారు. రాష్ట్రంలో బండి సంజయ్ బలమైన నాయకుడిగా ఎదుగుతున్న నేపథ్యంలో కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు

# కోర్టు ఉత్తర్వులు ధిక్కరించి భూమి ఆక్రమణ న్యాయం చేయాలంటూ వినతి

- భూమి వివాదం ఉద్రిక్తం.. హత్య బెదిరింపులు
- కొన్నప్పుడు ఉన్న సాక్షులు పల్లెముండయ్య గిరి వే న కొమురయ్య

**జమ్మికుంట మే 14 (ప్రజావాణి):** జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన గిరవెన కొరక్క భర్త సారయ్య జిల్లా పోలీస్ అధికారిని ఆశ్రయిస్తూ తన సొంత భూమిపై అక్రమ కబ్జా జరుగుతోందని ఫిర్యాదు చేశారు. తనకు చెందిన ఇంటి నెంబర్ 4 -7/4 స్థలానికి సంబంధించి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెం. 3972/2025 ఆధారంగా భూమి తన సొంతమని పేర్కొన్నారు. ఆత్మకూరు రాజయ్య తండి కనకయ్య, అతని కుటుంబ సభ్యులు భాగ్యమ్మ, విజయ్, రంజిత్, సందీప్ కలిసి తన స్థలంలో అక్రమంగా గోడ నిర్మాణం చేపట్టి కబ్జాకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సహకారం కూడా ఉందని తెలిపారు.ఈ భూమి వివాదంపై ప్రతివాది రాజయ్య జమ్మికుంట పోలీస్ స్టేషన్లో తనపై తప్పుడు ఫిర్యాదు చేయగా, తాను భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇంటి పన్ను రసీదులు, స్టాంప్ దస్తావేజులు సమర్పించి న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు చెప్పారు. హుజురాబాద్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు కేసు నెం. 765/2026లో తనకు ఇంజక్షన్ ఆర్డర్ జారీ చేసినప్పటికీ, కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి ప్రతివాదులు గోడ నిర్మాణం కొనసాగిస్తున్నారని వాపోయారు. తనను, తన కుటుంబ సభ్యులను బెదిరిస్తూ “స్థలం విషయమై ఎవరితో మాట్లాడినా హత్య చేస్తాం” అని ప్రాణహాని హెచ్చరికలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక పోలీసులకు కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ అందించినప్పటికీ తగిన రక్షణ కల్పించకుండా ప్రతివాదులకు సహకరిస్తున్నారని ఆరోపించారు.తన వద్ద ఉన్న













భూమి సంబంధిత పూర్తి ఆధారాలు, జిరాక్స్ పత్రాలు జిల్లా పోలీస్ అధికారికి సమర్పిస్తున్నానని, అవస రమైతే భూమి విక్రయ సమయంలో ఉన్న సాక్షులను కూడా విచారణకు హాజరుపరుస్తానని తెలిపారు. తన స్థలంలో అక్రమంగా నిర్మించిన గోడను తొలగించి న్యాయం చేయాలని, కుటుంబానికి రక్షణ కల్పించాలని గిరవెన సారయ్య విజ్ఞప్తి చేశారు.

# లక్ష్మీపూర్ లో ప్రొపెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించిన

**● గ్రామ సర్పంచ్ ముక్కిస కవిత -రత్నాకర్ రెడ్డి**



**బెజ్జంకి,మే 14(ప్రజావాణి):** సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ను గ్రామ సర్పంచ్ ముక్కిస కవిత రత్నాకర్ రెడ్డి ఉపాధ్యాయులు విద్యార్థులు నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ముక్కిస కవిత -రత్నాకర్ రెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో,గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తల్లీ దండ్రులకు పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలపై వివరించి పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తూన్నా ఉచిత విద్యతో పాటు అవసరమైన నోట్ బుక్స్ ఉచిత భోజన సౌకర్యం అందిస్తున్నారని వివరించారు. ఇట్టి సదుపాయాలను వినియోగించుకోవాలని తెలిపారు అలగే ప్రతిభావంతులైన ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడానికి నిరంతరం కృషి చేస్తున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## తాలు తేమ పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవు



**ప్రజావాణి శాయంపేట** :మండల పరిధిలోని రైతులను తాలు తేమ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని పరకాల ఏఎంసీ వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్ అన్నారు గంగిరేణి గూడెం గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం నిర్వాహకులు మరియు మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని.. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొని ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర పొందాలని ప్రవేటు వ్యక్తులకు తక్కువ ధరకు అమ్ముకొని మోసపోవద్దన్నారు ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ రాధిక కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి సర్పంచులు కుమారస్వామి హింగే భాస్కర్ చిందం రవి శానం కుమారస్వామి రమేష్ తదితరులు పాల్గొన్నారు

## ఆర్థిక సహాయం అందజేత



**ప్రజావాణి శాయంపేట** :మండలం పత్తిపాక గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కందగట్ల నరహరి ఇటీవల మృతి చెందినాడు. విషయం తెలుసుకున్న పలువురు చలించిపోయి 5500 రూపాయల ఆర్థిక సహాయంతో పాటు 50 కేజీల బియ్యాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి రాజిరెడ్డి, వార్డ్ మెంబర్ కందగట్ల ప్రవీణ్ కుమార్,గడ్డి రవి, రావుల తిరుపతి, వంగ రమేష్, వంగ అశోక్, పల్లెబోయిన శ్రీనివాస్, దండే పోయిన కట్టయ్య,అన్నెబోయిన వెంకటేష్, బాబు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు నడుం కట్టాలి

● రంగాపురంలో ఘనంగా బడిబాట



**నల్లబెల్లి, మే 14 ప్రజావాణి:** మండలంలోని రంగాపురం గ్రామంలో 'బడిబాట' కార్యక్రమం గురువారం ఉత్సాహంగా సాగింది. సర్పంచ్ ఓరుగంటి మాధురి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి గ్రామస్థులంతా ఏకమయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దుతామని, గ్రామ పంచాయతీ నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి మాట్లాడుతూ. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులు నినాదాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాకూబ్ రెడ్డి, స్వరాజ్యం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గూడెం చెక్‌పోస్టులను తనిఖీ చేసిన మంచిర్యాల డీసీపీ

● రామగుండం పోలీస్ కమిషనరేట్



**తేది:14-05-2026( ప్రజావాణి)** బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమ పశువుల రవాణాను అరికట్టడంతో పాటు శాంతిభద్రతలను పరిరక్షించేందుకు మంచిర్యాల జోన్‌లో గూడెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేసి వాహనాల తనిఖీలను పర్యవేక్షించారు. చెక్‌పోస్టుల వద్ద అమలులో ఉన్న భద్రతా చర్యలను పరిశీలించిన డీసీపీ, విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు,ఆదేశాలు జారీ చేశారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించారు.ప్రతి వాహనానికి సంబంధించిన వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు.అక్రమ పశువుల రవాణాపై పటిష్ట నిఘా కొనసాగుతోందని, నిబంధనలకు విరుద్ధంగా జరిగే రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని, అనుమానాస్పద రవాణా గమనించినట్లయితే స్థానిక పోలీసులకు లేదా 100 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని,భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు.డీసీపీ వెంట మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి,ఎస్సై సురేష్,దండేపల్లి ఎస్సై తైసినోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం నిల్వల్లో నాణ్యత పాటించాలి

● అమీనాబాద్ పీపీసీ సెంటర్లను తనిఖీ చేసిన సొసైటీ అధ్యక్షులు మురహరి రవి





**చెన్నారావుపేట మే 14 ప్రజావాణి** :రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే వరి ధాన్యంలో తేమ శాతం లేకుండా జాగ్రత్తలు వహించాలని, తాలు లేకుండా శుభ్రం చేసి తీసుకురావాలని అమీనాబాద్ సహకార సంఘం అధ్యక్షులు మురహరి రవి సూచించారు. గురువారం అమీనాబాద్ సహకార సంఘం పరిధిలోని పిపిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో ధాన్యం సేకరణ తీరును, రికార్డులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం రవి మాట్లాడుతూ.. రైతులు ఆత్రుత పడకుండా ధాన్యాన్ని బాగా ఆరబోసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ధాన్యం రవాణాలో జాప్యం జరగకుండా ట్రాన్స్‌పోర్టర్ విష్ణుతో మాట్లాడి, ఎప్పటికప్పుడు లారీలు పంపేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. గన్ని బ్యాగుల కొరత లేకుండా చూస్తామని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన కొనుగోలు ప్రక్రియ పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.?ఈ కార్యక్రమంలో తిమ్మరనిపహడ్ గ్రామ రైతులు నాగోతు బాలస్వామి, ఎటుకూరి జయరాజు, పుట్టి భాస్కర్, సతీష్ రాజు, అనిల్, సాల్మన్ రాజు, ఆర్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మదర్ డైరీ పాడి రైతులకు రూ.10 కోట్లు మంజూరు...

- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి పావని రెడ్డి
- పాడి రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం.
- మదర్ డైరీకి మళ్ళీ పూర్వ వైభవం.
- పాడి రైతులందరూ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడాలి.





**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 14** నల్లగొండ రంగారెడ్డి మదర్ డైరీ పాడి రైతుల పాల బిల్లుల చెల్లింపుగాను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ మంగళవారం 10 కోట్లు మంజూరు చేశారని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆదర్శ మహిళ రైతు పడమటి పావని వెంకటరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు బీర్ల ఐలయ్యకు, మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డికి, పాడి రైతులను ఆదుకోవడానికి ముందుకు వచ్చిన కాంగ్రెస్ పార్టీకి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. బిఆర్ఎస్ చెందిన ఆమె గత ప్రభుత్వం మదర్ డైరీని దివాల తీపించి, కోట్లాది రూపాయలు దోచుకొని సర్వనాశనం చేశారని పాడి రైతులకు కనీసం పాలు పోసిన బిల్లులు కూడా ఇవ్వలేదని, పాల బిల్లుల కోసం పాడి రైతులు అనేకసార్లు ధర్నాలు, ఆందోళనలు చేసినా బిఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని పావని వెంకటరెడ్డి తెలిపారు. ఉన్నది దోసుకుపోవటంతో పాటు, మరో 46 కోట్లు అప్పుచేసి దిగమింగారని, మధుర డైరీ మళ్ళీ కోలుకోవడానికి వీలు లేకుండా ఎక్కడ అప్పు పుట్టకుండా కూడా చేసి పోయారని ఆమె బిఆర్ఎస్ పార్టీ పాలకవర్గంపై మండిపడ్డారు. బి ఆర్ యస్ చేసిన అప్పులకు ప్రతినెల 40 లక్షల రూపాయలు వడ్డీ చెల్లిస్తున్నామని తెలిపారు. ఒకపక్క బిఆర్ఎస్ పాలకవర్గం చేసిన అప్పులను తీర్చుకుంటూనే, మరోపక్క మదర్ డైరీ పునర్ వైభవం తీసుకురావడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అందులో భాగంగానే ఎన్నో ఏళ్ల నుంచి పాడి , రైతులకు బకాయిలను మొదట తపాగా 10 కోట్లు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. పాడి రైతులందరూ ఆధ్వర్యపడాల్సిన అవసరం లేదని, మళ్లీ మనందరికీ మంచి రోజులు వస్తున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం పాడి రైతులకు అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఆమె భరోసా ఇచ్చారు. పాడి రైతులంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని పావని వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## రామగుండంలో వికసించిన అరుదైన 'మే పుష్పం'





**ప్రజావాణి//గోదావరిఖని** గోదావరిఖని సమీపంలోని రామగుండం మండల కేంద్రంలో ప్రకృతి అరుదైన అందాన్ని ఆవిష్కరించింది. ఏడాదికి ఒక్కసారి, కేవలం మే నెలలో మాత్రమే వికసించే అరుదైన 'మే పుష్పం' స్థానికులు ఇంజపురి శంకర్-శారదా దంపతుల ఇంటి పెరట్లో పూసి అందరినీ ఆకట్టుకుంటోంది.ఎర్రటి బంతిలా, ఫుట్‌బాల్ పరిమాణంలో వందలాది సన్నని రేకులతో వికసించిన ఈ పువ్వు చూపరులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఆకుపచ్చని ఆకుల మధ్య అగ్నిగోళంలా మెరిసిపోతున్న ఈ పుష్పం వద్దకు చిన్నారులు, మహిళలు చేరుకొని సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు.శాస్త్రీయంగా Scadoxus multiflorus గా పిలిచే ఈ పువ్వును తెలుగులో 'మే పుష్పం', 'అగ్ని పుష్పం' అని, ఇంగ్లీష్‌లో 'ఫుట్‌బాల్ లిల్లీ', 'బ్లడ్ లిల్లీ' అని వ్యవహరిస్తారు. ఏడాది పొడవునా భూమిలో దుంప రూపంలో నిద్రాణంగా ఉండే ఈ మొక్క, మే నెల రాగానే ముందుగా పువ్వును, అనంతరం ఆకులను విప్పుతుంది.ఎండలు మండే కాలంలో వర్షాకాలం రాకకు సంకేతంగా ఈ పుష్పం వికసిస్తుందని పెద్దలు చెబుతున్నారు. ఒక్కసారి పూసిన తర్వాత కేవలం 10 నుంచి 15 రోజులు మాత్రమే ఈ అరుదైన అందం కనువిందు చేస్తుండటంతో, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఆసక్తిగా వీక్షించేందుకు తరలివస్తున్నారు.

## కుటుంబ సభ్యుల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలి...

● స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు.



**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 14:** జనగణన--2027 గృహగణన కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురు వారం రోజు అనంతారం గ్రామంలో సూపర్వైజర్లు , ఎన్యూమరేటర్లు నిర్వ హిస్తున్న గృహగణన సర్వేను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి వివరాల నమోదు ప్రక్రియ , హౌస్ లిస్టింగ్ విధానం , కుటుంబాల వివరాల సేకరణ తదితర అంశాలను పరిశీలించి సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జనగణన 2027 అత్యంత కీలకమైందని తెలిపారు. సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్ల జనగణన నమోదు చేసేటప్పుడు తప్పులు లేకుండా నమోదు చేయాలని అన్నారు. అందు వల్ల ప్రజలు తమ కుటుంబ సభ్యుల వివరాలను సరైన విధంగా అందించి సహకరించాలని కోరారు. అధికారులు , ప్రజల సమన్వయంతో జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## డ్రగ్స్, వడ్డీ దందాలపై విచారణ జరపాలి

● ప్రశాంత్ గౌడ్‌పై గౌరీ రెడ్డి శ్రీధర్ రెడ్డి సంచలన ఆరోపణలు.



**కొండాపూర్, మే 14 (ప్రజావాణి):** డ్రగ్ ఫెడ్లర్ ప్రశాంత్ గౌడ్ అక్రమ దందాలపై సమగ్ర విచారణ జరిపి, అతడి వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను పోలీసులు బయటపెట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు గౌరీ రెడ్డి శ్రీధర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కొండాపూర్ మండలం మల్కాపూర్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు సంచలన ఆరోపణలు చేశారు.ప్రశాంత్ గౌడ్ అక్రమ సంపాదన రహస్యం తొగర్‌పల్లి గ్రామ ప్రజలకు తెలిస్తే గ్రామం మొత్తం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని వ్యాఖ్యానించారు. తొగర్‌పల్లి ప్రభుత్వ పాఠశాల ముందు బెల్ట్ షాప్ నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్నాడని ఆరోపించారు. వెంటనే ఆ షాప్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు.ప్రశాంత్ గౌడ్ తనను డబ్బుల సహాయం కోరాడని, తాను నిరాకరించడంతో తనపై మరియు తన కుటుంబంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడని గౌరీ రెడ్డి ఆరోపించారు. వడ్డీ వ్యాపారం, కమిషన్ దందాల ద్వారా పేదలను దోచుకుంటూ యువతను మద్యానికి బానిసలుగా మారుస్తున్నాడని మండిపడ్డారు. కొండాపూర్ సీఐ, ఎస్ఐలు తనను "చంపేస్తాం" అంటూ బెదిరించారని కూడా ఆయన ఆరోపించారు. పల్లె ప్రకృతి వనం ధ్వంసంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్లో కేసు వేసి న్యాయపోరాటం చేస్తానని స్పష్టం చేశారు.గంజాయి, డ్రగ్స్ కేసులో సీసీఎస్ పోలీసులు తీసుకెళ్లిన వ్యక్తిని కొందరు స్థానికులు తిరిగి తీసుకువచ్చారని, దీనివల్ల వారికి భాగస్వామ్యం ఉందేమో అనుమానం కలుగుతోందన్నారు.తనకు కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ప్రజలను మోసం చేస్తున్న వారిని గ్రామస్తులు నిలదీయాలని పిలుపునిచ్చారు.తనపై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు ఉంటే బయటపెట్టాలని ప్రశాంత్ గౌడ్‌కు సవాల్ విసిరిన గౌరీ రెడ్డి, గ్రామ ప్రజల హక్కులు, రైతులకు న్యాయం, ఉద్యోగాల కోసం తన పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

## ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య: ఎంఈఓ పాపమ్మ

● కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కంది కృష్ణ చైతన్య రెడ్డి తో కలిసి బడిబాట పోస్టర్ నీ ఆవిష్కరించిన ఎంఈఓ





**చెన్నారావుపేట మే 14 ప్రజావాణి** చెన్నారావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా చెన్నారావుపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బడిబాట పోస్టర్‌ను కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కంది కృష్ణ చైతన్య రెడ్డి ఆవిష్కరించారు.?ఈ కార్యక్రమంలో ఎంఈఓ పాపమ్మ మాట్లాడుతూ..ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కృష్ణ చైతన్య రెడ్డి మరియు సర్పంచ్ కంది శ్వేతా చైతన్య రెడ్డిలతో మాట్లాడుతూ.. గ్రామంలోని అర్హులైన పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలోనే చేరేలా చొరవ చూపాలని విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు సహకరించాలని వారిని కోరారు. దీనిపై కంది కృష్ణ చైతన్య రెడ్డి మరియు సర్పంచ్ కంది శ్వేత చైతన్య రెడ్డి లు స్పందిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా తమ వంతు కృషి చేస్తామని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సహకరిస్తామని పాఠశాలలో పిల్లలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు పోలేపెల్లి రవి, పాఠశాల ఉపాధ్యాయులు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో ఆహార కల్తీని అరికట్టాలి...

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు.
- ఆహారం విషయంలో నిర్లక్ష్యం చేయకూడదు.
- నిబంధనలు పాటించని వ్యాపారులపై జరిమానాలు క్రిమినల్ కేసులు నమోదు.
- జిల్లా ఆహార పరిరక్షణ డెసిగ్నేటెడ్ ఆఫీసర్ పి. స్వాతి.



**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 14:**జిల్లాలో ఆహార కల్తీని అరి కట్టేందుకు చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం రోజు తన ఛాంబర్ లో ?ఆహార భద్రతపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధ్యక్షతన? జిల్లా ఆహార పరిరక్షణ డెసిగ్నేటెడ్ ఆఫీసర్ పి. స్వాతి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశం నిర్వ హించబడింది. ఈ సమావేశంలో ప్రజా రోగ్యం , ఆహార నాణ్యత , కల్తీ నివారణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాసంస్థలు , హాస్టళ్లలో ఆహారాన్ని వండే సిబ్బందికి తక్షణమే ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వంట చేసే వాళ్ళు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యార్థులకు సురక్షితమైన ఆహారం అందుతుందని ఆయన పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలకు , బాలింతలకు పంపిణీ చేసే గుడ్లు , ఇతర ముడి సరుకుల నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గుడ్ల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రస్తుతం ప్రధాన సమస్యగా మారిన పాల కల్తీపై ఆహార భద్రత అధికారులు , పోలీస్ అధికారులతో కలిసి జాయింట్ రైడ్స్ (ఉమ్మడి దాడులు) నిర్వహించి , కల్తీకి పాల్పడే వారిపై కఠినమైన కేసులు నమోదు చేయాలని సూచించారు. చిరు , మీడియం స్కేల్ వ్యాపారులు ఎఫ్ఎస్ఎస్ఐ లైసెన్స్ పొందాలని,వారికి అవ గాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్స హించాలని,కూరగాయలు,పండ్ల సాగుకై పెస్టిసైడ్స్ వాడకం తగ్గించాలని తెలిపారు.ఆహార భద్రత నియమిత అధికారి పి.స్వాతి మాట్లాడుతూ జిల్లాలో ఆహార కల్తీని అరికట్టేందుకు తమ బృందం నిరంతరం శ్ర మిస్తుందని , నిబంధనలు పాటించని వ్యాపారులపై భారీ జరిమానాలు విధిస్తామని , క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి మనోహర్ , జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ , జిల్లా సంక్షేమ అధికారి నరసింహ రావు , భువనగిరి రూరల్ సిఐ చంద్ర బాబు , పలు శాఖల జిల్లా అధికారులు , సలహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ధాన్యం లిఫ్టింగ్‌లో జాప్యం లేకుండా వెంటనే చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా నిర్వహించాలి
- మంథని మండలం పుట్టపాక ఐకెపి కేంద్రం, మంథని మార్కెట్ యార్డును పరిశీలించిన జిల్లా కలెక్టర్







**మంథని నియోజక వర్గం, మే 14, ప్రజావాణి:**జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, లిఫ్టింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పెద్దపల్లి మండలం రంగాపూర్‌లోని ఐజి గోదాములను, మంథని మండలం పుట్టపాక గ్రామంలోని ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని , మంథని మార్కెట్ యార్డు సందర్శించి ధాన్యం కొనుగోలు, నిల్వలు, లిఫ్టింగ్ పరిస్థితులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మంథని మార్కెట్ యార్డు మాట్లాడుతూ నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద వేగవంతంగా కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎక్కువకాలం కేంద్రాల వద్ద నిల్వ ఉంచకుండా వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం స్టాక్ పెండింగ్‌లో లేకుండా చూడాలని తెలిపారు.ప్రస్తుతం రోజుకు సుమారు 70 లారీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, అదనంగా మరో 30 నుంచి 40 లారీలను వెంటనే ఏర్పాటు చేయాలని ఆర్టీఓ శాఖ, రవాణా ఏజెన్సీలకు సూచించారు. డీసీఎం వాహనాలను కూడా ధాన్యం రవాణాకు మళ్లించాలని ఆదేశించారు. అవసరమైతే కొద్ది రోజులపాటు ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను కూడా ధాన్యం రవాణాకు వినియోగించాలని తెలిపారు.కొనుగోలు కేంద్రానికి సమీపంలోనే రైస్ మిల్లులు ఉన్నచో ట్రాక్టర్ల ద్వారా కూడా ధాన్యాన్ని తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, రవాణా, లిఫ్టింగ్ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని తెలిపారు.అనంతరం మంథని మున్సిపల్ పరిధిలోని 12వ వార్డు (దొంతులవాడ)లో జరుగుతున్న సెన్సెస్ (జనాభా లెక్కల) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. తరువాత మంథని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ పర్యటనలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, సయేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తదితరులు జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

# కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా

- మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్



**మంథని నియోజక వర్గం, మే 14, ప్రజావాణి:**మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను అభివృద్ధి చేసేందుకు తన శాయ శక్తుల కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ అన్నారు. వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి తో కలిసి కళాశాలలో జరిగిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జరిగిన పేరెంట్ టీచర్ మీటింగ్ లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అన్ని సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల అభివృద్ధికి రాష్ట్ర ఐ టీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఇప్పటికే నిధులు కేటాయించారని, మంత్రి సహాయ సహకారాలతో కళాశాలను మరింతగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. ఇంత అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్న ఈ కళాశాల విద్యార్థిని ప్రభుత్వ కళాశాలలో జిల్లాలో మొదటి స్థానం సాధించడం అభినందనీయమన్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి కార్పొరేట్ కళాశాలలో చదివే బదులు అదే స్థాయిలో విద్యనందిస్తున్న ప్రభుత్వ సంస్థను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలోజీ, అధ్యాపకులు రావుల తిరుమల్, శశాంక్ , శ్రీదేవి, నగేష్, ఎల్ ఆర్ కే రెడ్డి, సబిత, మౌనిక, సిబ్బంది బియ్యబాని, అనసూయ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# స్వర్ణగిరీషుని సేవలో భారత ఉగ్రవాద వ్యతిరేక సంఘం జాతీయ చైర్మన్..

- మాజీ ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మనిందర్ జీత్ సింగ్ బిట్టా.







**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి మే 14**భూలోక వైకుంఠంగా విరాజిల్లుతున్న తెలంగాణ యాదాద్రి తిరుమల దేవస్థానం స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంకు గురువారం రోజు ప్రముఖ సామాజిక నాయకుడు , అఖిల భారత ఉగ్రవాద వ్యతి రేక సంఘం జాతీయ చైర్మన్ , మాజీ ఇండియన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మనిందర్ జీత్ సింగ్ బిట్టా విచ్చేసి శ్రీ స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థాన అర్చకులు ఆలయ అధికారులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి , వేదాశీర్వచన మండపంలో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన ఆలయ మహాద్వారం , ప్రధాన గర్భాలయం , ఉప ఆలయాలు , యాగశాల , గోశాల , తీర్థ ప్రదేశాలు తదితర పవిత్ర స్థలాలను సందర్శించి క్షేత్ర వైభవాన్ని ఆస్వాదించారు. అలాగే భారతదేశంలోనే ఎక్కడా లేనివిధంగా ఈ క్షేత్రంలో కొలువుదీరి ఉన్న జలనారాయణ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకంగా ప్రార్థనలు పూజలు నిర్వ హించారు. భూలోక వైకుంఠంగా పేరుపొందుతున్న స్వర్ణగిరి క్షేత్ర నిర్మాణ శైలి , ఆధ్యాత్మిక వాతావరణం , స్వామివారి నిత్య కైంకర్యాలు వైష్ణవ ఆగమ సంప్రదాయల పద్ధతిలో నిర్వహించ బడుతున్న సేవలను చూసి ఆయన ఆనందం వ్యక్తం చేశారు. దేశంలో ధార్మిక చైతన్యం , సంస్కృతి పరిరక్షణలో ఇటువంటి దివ్య క్షేత్రాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

## వేసవిలో కూలీలు జాగ్రత్తగా ఉండాలి.



**కమాన్ పూర్,మన సమగ్ర ప్రజావాణి మే 14.**వేసవిలో ఉపాధి హామీ కూలీలు జాగ్రత్తగా ఉండాలని కమాన్ పూర్ మండలం సిద్దిపల్లె గ్రామ సర్పంచ్ బంగారు కళ్యాణి మహేష్ అన్నారు.గురువారం గ్రామంలోని ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు,ఓఆర్ఎస్ ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... ఎండలు తీవ్రంగా ఉన్నాయని ప్రతి కూలి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.ఎండ తీవ్రత కాకముందే పనులు ముగించుకొని ఇంటికి వెళ్లాలని అన్నారు.ప్రభుత్వం కూడా ఉపాధి హామీ కూలీలకు పలు వసతులు కల్పించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొత్తపల్లి సతీష్,గ్రామ కార్యదర్శి జంజర్ల అమల, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- గుర్తు తెలియని వాహనం ఢీకొని 'వల్లంపట్ల' వాసి మరణం



**జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్, ఎండపల్లి మే 14(ప్రజావాణి):**జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం చర్లపల్లి గ్రామ శివారులో మే 13, బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందారు. ఉమ్మడి వెల్గటూర్ మండల ఎస్సై పులిచర్ల ఉదయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.... రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన ఎరవెల్లి పర్శరాం (43) బుధవారం రాత్రి తన కారులో ప్రయాణిస్తూ, చర్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఆగి. కారును రోడ్డు పక్కన పార్క్ చేసి, రోడ్డు దాటుతున్న క్రమంలో వేగంగా వచ్చిన ఒక గుర్తు తెలియని వాహనం ఆయనను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పర్శరాంకు తీవ్ర రక్త స్రావం తో కూడిన గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు పర్శరాం గత నాలుగు నెలలుగా కరీంనగర్‌లో నివసిస్తూ, సోడా బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య నాలుగేళ్ల క్రితమే మరణించింది. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రి మరణంతో ఆ ముగ్గురు పిల్లలు ఇప్పుడు అనాథలయ్యారు. మృతుని తల్లి ఎరవెల్లి లింగవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెల్గటూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై ఉదయ్ కుమార్ వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## అక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ స్థలం

- హద్దులు ఏర్పాటు చేసి ప్రజా అవసరాలకు వినియోగించాలంటున్న గ్రామస్తులు




**బెజ్జంకి, మే 14(ప్రజావాణి ):**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల గ్రామంలో సర్వే నంబర్లు 60, 61లో ఉన్న ప్రభుత్వ స్థలం హద్దులు లేకపోవడంతో అక్రమణలకు గురవుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూమికి స్పష్టమైన హద్దులు లేకపోవడంతో కొంతమంది ఆక్రమణలకు పాల్పడే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు.ఈ నేపథ్యంలో గతంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేసి ప్రభుత్వ స్థలానికి హద్దులు ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆ స్థలాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు కోసం స్థలం మంజూరు,చేయాలని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.సర్పంచ్‌తో పాటు మండల రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమికి తక్షణమే హద్దులు ఏర్పాటు చేసి అక్రమణలను నివారించాలని గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని, గ్రామపంచాయతీ పాలకవర్గాన్ని వేడుకుంటున్నారు.

## హైస్కూల్లో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులకు ఘనంగా సన్మానం చేసిన

- సర్పంచ్ రేణిగుంట్ల శ్యామల కుమార్
- ఎస్సై క్రాంతి కుమార్
- ఎంఈఓ రాములు





**జమ్మికుంట మే 14 ప్రజావాణి::**కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలంలోని మన సిరిసేడు హైస్కూల్లో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులకు సర్పంచ్ సన్మానం చేయడం జరిగినది అలాగే ప్రైజ్ మనీ కూడా డొనేట్ చేయడం స్కూల్ ఫస్ట్ వచ్చిన విద్యార్థి కి 5000/స్కూల్ సెకండ్ వచ్చిన విద్యార్థికి 3000/స్కూల్ థర్డ్ వచ్చిన విద్యార్థికి 2000/జరిగినది ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట ఎస్సై క్రాంతి కుమార్ ఎంఈఓ రాములు ఉప సర్పంచ్ ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

## బెజ్జంకి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా లింగాల శ్రీనివాస్



**బెజ్జంకి, మే 14(ప్రజావాణి ):**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బెజ్జంకికి చెందిన లింగాల శ్రీనివాస్‌ను నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తూముకుంట అంక్షా రెడ్డి ప్రకటించారు. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తమ నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బోడుప్పల్ లో సర్వే నంబర్లు మార్చి రిజిస్ట్రేషన్......?

- మున్సిపల్ పర్మిషన్ రద్దు చేయాలని డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు
- బోమ్మక్ సాయికిరణ్



**మేడిపల్లి మే 14( మన ప్రజావాణి)** సర్వే నంబర్లలో మార్పులు చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొనినిబందనలకు విరుద్ధంగా పొందిన మున్సిపల్ పర్మిషన్‌ను వెంటనే రద్దు చేయాలని బోమ్మక్ సాయికిరణ్ డిమాండ్ చేశారు.ఈ మేరకు బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌కు వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఈ విషయంపై మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో సర్వే నంబర్లు 149,150,ప్లాటు నెంబర్ 12 తో రిజిస్ట్రేషన్ జరిగిన భూమిని,అనంతరం కేవలం 149 సర్వే నంబర్‌తో మళ్లీ రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపించారు.సర్వే నంబర్ 150 వక్ఫ్ భూమిగా ఉన్నప్పటికీ దానిని దాచిపెట్టి రికార్డుల్లో మార్పులు చేసి పర్మిట్ నెం: 3467/జిహెచ్ఎంసి/ ఎస్డబ్ల్యూబిపి/యూపిల్2/2026,తేది:13 ఏప్రిల్ 2026 న అనుమతులు పొందారని పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, సంబంధిత నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు.భూ రికార్డులు,రిజిస్ట్రేషన్ వివరాలు,ముస్సిపల్ అనుమతులపై సమగ్ర దర్యాప్తు జరిపితే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయని ఆయన అన్నారు.అక్రమాలు నిరూపితమైతే సంబంధిత అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నీట్ పేపర్ లీక్ తో అంధకారమైన విద్యార్థుల భవిష్యత్తు: మూడు రమేష్ నాయక్



**చెన్నారావుపేట మే 14 ప్రజావాణి :**నీట్ పరీక్ష పేపర్ లీక్ బీజేపీ డబల్ ఇంజన్ సర్కార్ అసమర్థతకు నిదర్శనమని బిఆర్ఎస్ మండల యూత్ నాయకుడు మూడు రమేష్ నాయక్ ధ్వజమెత్తారు. రాజస్థాన్ వంటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పేపర్లు రూ. 28 లక్షలకు అమ్ముడుపోతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మౌనం వహించడం శోచనీయమన్నారు.పేపర్ లీక్ అవ్వడం వల్ల లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమైందని, తల్లిదండ్రుల ఆశలు అడియాసలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల జీవితాలను వేలం పెడుతున్న నిందితులను కఠినంగా శిక్షించి బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# కన్నాల పాఠశాలలో విద్యా వారోత్సవాలు



**మంథని నియోజక వర్గం, మే 14, ప్రజావాణి:** మంథని మండలం కన్నాల జెడ్ పి హెచ్ ఎస్ లో తల్లిదండ్రుల- ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో సర్పంచ్ గుడిసె గట్టయ్య మాట్లాడుతూ పాఠశాలలో డిజిటల్ తరగతులు, సోలార్ పానెల్, విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్ డ్రెస్సులు అన్ని ప్రభుత్వ సహకారంతోటి అందజేస్తున్నామని ప్రభుత్వ పాఠశాల పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపవలసిందిగా తెలియజేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుల వంగల కీర్తన ఉపాధ్యాయులు కే శ్రీనివాస్ రాధిక సావిత్రి శ్రీలత వెంకటేశ్వర్లు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసార్ మమత 30 మంది తల్లిదండ్రులు ఈ సమావేశంలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందని ఇక ముందు కూడా ఇటువంటి సమావేశాలకు పిల్లలు తల్లిదండ్రులు అందరు హాజరైతే బాగుంటుందని ప్రధాన ఉపాధ్యాయులు తెలియజేయడం జరిగింది.

# బటర్ ఫ్లై చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెప్పులు పంపిణీ





**లక్ష్మీదేవిపల్లి/మన ప్రజావాణి (మే 14):** బటర్ ఫ్లై చారిటబుల్ ట్రస్ట్, బియాండ్ డోనర్ సంయుక్త ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమల్ల గ్రామపంచాయతీ పరిధిలోని క్రాంతినగర్, గంగమ్మ కాలనీ, రాజీవ్ నగర్ గ్రామాలకు చెందిన చిన్నారులకు రూ.25 వేల వ్యయంతో చెప్పులను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద పిల్లల అవసరాలను గుర్తించి, వారికి అవసరమైన సహాయం అందించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. చిన్నారులు ఆరోగ్యంగా, సురక్షితంగా పాఠశాలకు వెళ్లేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బటర్ఫ్లై చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ నీలేష్, ఇండియన్ వాలంటీర్ రూప్లా నాయక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన పెద్ది స్వప్న రెడ్డి





**చెన్నారావుపేట మే 14 ప్రజావాణి** మండలంలోని పలు గ్రామాల్లో గురువారం నిర్వహించిన వివాహ వేడుకలకు మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. బాపునగర్‌కు చెందిన బిఆర్ఎస్ కార్యకర్త బాదావత్ భాస్కర్ తమ్ముడు రాజు నాయక్-రూప్నల వివాహానికి, అలాగే కందిగడ్డకు చెందిన మాజీ వార్డు మెంబర్ పాద్య బాలు కుమారుడు జగన్-నిక్షితల వివాహానికి ఆమె విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్, మాజీ సర్పంచులు స్వామి నాయక్, కృష్ణ, మంగమ్మ, మేగ్య నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు దప్పు వీరన్న, అంగోతు రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# చివరి ధాన్యం గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేసి తీరుతాం...!

- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఖమ్మం భద్రాద్రి జిల్లాలలోధాన్యం కొనుగోళ్లపై సమీక్షించిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి







**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి :**కొనుగోలు కేంద్రంలో చివరి ధాన్యం గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.గురువారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 8,575 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ యాసంగి సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి సుమారు 140 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చినట్లు చెప్పారు. ఇందులో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం 22 వేల కోట్లు సిద్ధంగా ఉంచిందని తెలిపారు.ఇప్పటి వరకు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులకు 4 వేల 800 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతి సంవత్సరం సుమారు 45 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు.సాధారణంగా బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి హమాలీలు వస్తారని, ప్రస్తుతం అక్కడి పరిస్థితుల కారణంగా హమాలీల కొరత ఏర్పడిందన్నారు. తీవ్ర ఎండల కారణంగా కూడా కొంతమంది హమాలీలు పగటి వేళల్లో పనిచేయలేక పోతున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.
రవాణా సమస్య పరిష్కారం కోసం వచ్చే 15 రోజుల పాటు లారీలు, డీసీఎంలను ప్రధానంగా ధాన్యం రవాణాకే వినియోగించా లని నిర్ణయించినట్లు తెలిపారు. ఇసుక, సిమెంట్ తదితర రవాణాపై నియంత్రణ విధించి ధాన్యం తరలింపుకే ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.ఈసారి పంట దిగుబడి భారీగా పెరగడంతో నిల్వ సమస్య కూడా ఎదురవుతోందన్నారు. అదనపు గోదాములు, నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం తేమ శాతం మించకుండా, శుభ్రమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు.క్వింటాల్‌కు ఐదు, ఆరు కిలోల వరకు అక్రమ కటింగ్‌లు చేస్తున్నారనే సమాచారం వస్తోందని, ఇది ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం అవసరమైతే ప్రభుత్వం కొంత నష్టాన్ని భరించేందుకైనా సిద్ధంగా ఉందన్నారు. ఈ ప్రభుత్వం కనీస మద్దతు ధరకు అదనంగా 500 రూపాయలు బోనస్ అందించడంతో రైతులు రికార్డు స్థాయిలో వరి సాగు చేశారని తెలిపారు. ధాన్యంతో పాటు మొక్కజొన్న కొనుగోళ్లు కూడా ప్రభుత్వం నిర్వహిస్తోందని, రైతులు ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. “చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది” అని స్పష్టం చేశారు.ధాన్యం కొనుగోళ్లలో తాలు, తరుగు, కటింగ్‌లు అసలు ఉండకూడదని ఇప్పటికే కఠిన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎక్కడైనా రైస్ మిల్లర్లు అక్రమంగా కటింగ్‌లు చేస్తే ఆయా రైస్ మిల్లులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ జిల్లాలో 309 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని చెప్పారు.ఇప్పటి వరకు 94,961 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రాగా, అందులో 80 వేల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసి గోదాములకు తరలించినట్లు వివరించారు. ట్యాబ్ ఎంట్రీ పూర్తైన రెండు రోజులలోనే రైతులకు చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు.కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రైతులు ధాన్యం విక్రయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా ధాన్యం సేకరణ జరుగు తోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తాలు, తరుగు పేరుతో ఎలాంటి కోతలు విధించకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. రైతుల నుంచి ఎవరైనా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ఈ సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర, సిపి సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస్ రెడ్డి, కొత్తగూడెం అదనపు కలెక్టర్ డి. వేణు గోపాల్, కొత్తగూడెం ఎస్పీ బి. రోహిత్ రాజ్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ప్రజాప్రతినిధులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల తల్లిదండ్రుల పాత్ర కీలకం



**మంథని నియోజక వర్గం, మే 14, ప్రజావాణి:** కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల, తల్లిదండ్రుల పాత్ర కీలకమని గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంథనిలో “ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక” విద్యా వారోత్సవాల నాలుగవ రోజు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పేరెంట్ - టీచర్ పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ హోజా తెలియజేశారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల బలోపేతానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు, మంత్రి శ్రీధర్ బాబు చొరవతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలే ధ్యేయంగా కొత్తగా బీ.కాం. బి ఎఫ్ ఎస్ ఐ వంటి ఏఈ డిపి కోర్సులను ప్రవేశపెట్టడం జరిగిందని వాటిలో చేరి చదువు పూర్తి కాగానే ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందవచ్చునని తెలిపారు. కళాశాలలోని సదుపాయాలను కోర్సుల వివరాలను తెలియజేస్తూ విద్యార్థుల సంఖ్య పెంపుదలలో పూర్వ విద్యార్థుల, విద్యార్థుల తల్లిదండ్రుల సహాయ సహకారాలు అవసరమని కోరారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల మండలి అధ్యక్షులు కొండేల మారుతి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి విద్యార్థుల పెంపునకు అవసరమైన సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందజేస్తామని తెలియజేశారు. తదనంతరం కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపక బృందం సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థుల మండలి అధ్యక్షులు కొండేల మారుతి విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులను శాలువాతో సత్కరించారు. అడ్మిషన్ల పెంపు ప్రక్రియలో భాగంగా నాగారం గ్రామపంచాయతీని సందర్శించి గ్రామ సర్పంచ్ బెల్లంకొండ శ్రీదేవి సత్యనారాయణ ను పంచాయతీ సెక్రెటరీ బొగె వికాస్ లను కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్ పరిశయ్య, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ కర్నాటి కృష్ణ, ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆడెపు లక్ష్మీనారాయణ, చరిత్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, ముకుందం, శేఖర్, కృష్ణ, శ్రీధరాచార్యులు, రాజు, సురేష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పర్యలు ప్రవేశపెట్టినటువంటి ప్రత్యేక మొబైల్ యాప్ MD ML





**ప్రజావాణి ప్రతినిధి కూనవరం మండలం మే 14** :పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం కూనవరం మండలం కూనవరం గ్రామంలోని అంబేద్కర్ వివో గ్రూపు లోని ఈరోజు *MD ML * ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం డ్వాక్రా మహిళల కోసం గౌరవ ముఖ్యమంత్రివర్యులు ప్రవేశపెట్టినటువంటి ప్రత్యేక మొబైల్ యాప్ మన డబ్బులు మన లెక్కలు అనే పేరుతో ప్రత్యేక యాప్ ను డ్వాక్రా మహిళలకు వారికి మొబైల్లో వారి ఆర్థిక లావాదేవీలు పారదర్శకం తీసుకురావటం మోసాలను అరికట్టడం ముఖ్య ఉద్దేశంగా ఎండి ఎంఎల్ యాప్ ను డోక్రా మహిళలకు తీసుకు రావడం జరిగింది. ఇంటి నుంచి చెల్లింపులు ఖాతా వివరాలు మోసాలకు చెక్కు పెట్టడం డిజిటల్ సేవ వినియోగం ముఖ్య ఉద్దేశం ఈరోజు గౌరవ ముఖ్యమంత్రివర్యులు ఆదేశాల మేరకు అంబేద్కర్ వివో యూత్ డ్వాక్రా గ్రూపు సభ్యులు మహిళలతో ర్యాలీగా నిర్వహించివారికి డిస్టిలేషన్ యాప్ గురించి వివరించడం జరిగింది. కార్యక్రమంలోని వివో సూరం జ్యోతి కూనవరం గ్రామ శాఖ అధ్యక్షులు ఎచ్చు రవి యాప్ గురించి వివరించి మోసాలను అరికట్టించి నూతన విధానాన్ని తెలుసుకోవాలి స్వయంగా మీ మొబైల్ లోనే ఈ యాప్ ద్వారా మీ డబ్బులు లావాదేవీలు గురించి తెలుసుకోవాలని వివరించడం జరిగింది

# తిరుమల శ్రీవారి సేవలో రాయికల్ మహిళలు



**రాయికల్ ;మే 14 (ప్రజావాణి):**పవిత్ర వైశాఖమాసం సందర్భంగా రాయికల్ పట్టణానికి చెందిన మహిళా గ్రూపు సభ్యులైన పన్నెండు మంది మహిళలు తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీవేంకటేశ్వర స్వామి వారి సేవకార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈనెల 12 వ తేదీ నుంచి 20వ తేదీ వరకు వారం రోజుల పాటు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి సేవా కార్యక్రమాల్లో వివిధ రకాల విధులు నిర్వహిస్తున్నారు. ఈ సేవలో భాగంగా క్యూలైన్లలో భక్తుల్ని పంపించడం అన్న ప్రసాద వడ్డన ఏకాంత సేవ తదితర సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఈ సేవలో రాయికల్ కు చెందిన గడ్డల లావణ్య, చెరుకు పల్లవి,దాసరి ఉమారాణి,కృపాలి,జక్కాపురి సౌజన్య ,ఎలిగేటి స్రవంతి,పద్మ సరిత,సంధ్య, సునీత,రమాదేవి పునుగోటి ఉమ తదితరులు పాల్గొన్నారు.ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన తిరుమల క్షేత్రం నందు స్వామి వారి అనుగ్రహంతో తమకు సేవా కార్యక్రమాలు చేసే అవకాశం వచ్చిందని వారు ఆనందంగా తెలిపారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com

# 18 వార్డులో జీడి వ్యాపారి నిబంధనలకు విరుద్ధంగా జీడి పిక్కల ఫ్యాక్టరీలు రన్ చేస్తున్నారు

- బాయిలింగ్ పద్ధతికి విరుద్ధంగా రోస్టర్ విధానంలో. జీడి పిక్కలు కాల్పులు చేస్తున్నారు.
- జనావాసాలపై జీడి కాలుష్యం కమ్ముకుంటుంది ..
- ప్రజలు అనారోగాలు పాలవుతున్న పట్టించు కోని అధికారులు..
- కాలుష్య అధికారులకు. పిర్యాదు చేసాము ..
- హైకోర్టు తీర్పును బేఖాతరు చేస్తున్నారు.
- చర్యలు తీసుకోవాలని కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారూ









**పలాస ప్రజావాణి ప్రతినిధి :**శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం లోని పలాస మున్సిపాలిటీ పరిధిలోని గల 18వ వార్డ్ మారుతి నగర్ మంకినమ్మ గుడి ఎదుట గల ఓ జీడి వ్యాపారి మద్దతు తో ఫ్యాక్టరీలు నిబంధనలకు విరుద్ధంగా జీడి పిక్కలను కాల్పులు జరుపుతున్నారనీ స్థానికులు ఆరోపిస్తున్నారు.వాస్తవానికి రోస్టింగ్ విధానం వద్దని బాయిలింగ్ విధానంలో పరిశ్రమలు నడుపుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు రాష్ట్ర ప్రభుత్వం కూడా అనుబంధాలను పాటించాలని కాలుష్య నియంత్రణ మండలి కూడా తగిన ఆదేశాలు జారీచేసింది. ఐతే వీటి అన్నిటిని కాదని ఓ జీడి వ్యాపారి ఆధ్వర్యంలో నడుపు బడుతున్న జీడి పిక్కల ఫ్యాక్టరీలు నిబంధనలకు విరుద్ధంగా బాయిలింగ్ సిస్టమ్ కాకుండా రోస్టింగ్ విధానంలో ఇక్కడ ఫ్యాక్టరీలు నడుపుతూ ఉండటం తో జనా వాసాలు మద్యలో ఉన్న పరిశ్రమలతో జీడి పొగ అలాగే జీడి వ్యర్థాలు జీడి ధూళి పరిసర ప్రజలకు అనారోగ్యానికి గురైతూన్నారని అన్నారు. ఇప్పటికే పరిశ్రమలన్నీ ఇండస్ట్రియల్ ఏరియాకి తరలి వెళ్లగా ఈ ఫ్యాక్టరీలు కు నాయకత్వం వహిస్తున్ ఓ పెద్ద వ్యాపారి నిబంధనలకు విరుద్ధంగా నడుపుతు న్నాడు. ఈ విషయంపై గతంలో మున్సిపల్ కమిషనర్ ఇన్స్పెక్షన్ వేయగా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు దీనిపైన కూడా మారుతీనగర ప్రజలు జిల్లా పొల్యూషన్ బోర్డు అధికారులకూడా పిర్యాదు చేయడం జరిగింది. అయితే ఎటువంటి చర్యలు తీసుకోలేదు .ప్రస్తుత మున్సిపల్ కమిషనర్ దీని పై స్పందించి చర్యలు తీసుకోవాలని మా మారుతి నగర ప్రజలు కోరుతున్నారు..జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు జోక్యం చేసుకోవాలి. కూటమి నేతలు డిమాండ్ పలాస మున్సిపాలిటీ పరిధిలోనీ 18 వ వార్డు లో నిబంధనలు విరుద్ధంగా జీడి పరిశ్రమలు రన్ చేస్తున్నారని పలాస కూటమి నేతలు ఆరోపణలు చేస్తున్నారూ. ఇక్కడ చట్టానికి వ్యతిరేకంగా జీడి ఫ్యాక్టరీలు నడుపుతున్నారని కూటమి నేతలు ఇదివరకే గత మున్సిపల్ కమిషనర్ కు, మాజీ మున్సిపల్ చైర్మన్ కు వినతి పత్రాలు ఇచ్చారు. వినతి పత్రాలు స్పందించిన మాజీ మున్సిపల్ కమిషనర్ ఆయా పరిశ్రమలను పరిశీలించి నిబంధనలను పాటించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని జారీ చేశారు.. ఇక్కడితో కాకుండా జిల్లా కాలుష్య మండలి కార్యాలయానికి కూటమి నేతలైన హనుమంతు మురళీమోహన్ తదితరులు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకుండా పోయిందని ఆ కాలనీ వాసులు మళ్లీ పోరాటానికి సిద్ధమయ్యారని మురళీమోహన్ ద్వారా వెల్లడించారు. ఇప్పటికైనా జిల్లా కాలుష్యం మండలి జోక్యం చేసుకొని 18వ వార్డులోని నిబంధనలు విరుద్ధంగా జరుగుతున్న జీడి పరిశ్రమల కాల్పులు విషయంలో నిజానిజాలు తెలుగులో తేవాలని వారు కోరారు..

# ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

- అల్లీపూర్ సర్పంచ్ ఏంబారి గౌతమి-వెంకటేష్





**రాయికల్; మే 14 (ప్రజావాణి):**ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అల్లీపూర్ గ్రామ సర్పంచ్ ఎంబారి గౌతమి-వెంకటేష్ అన్నారు.గురువారం రాయికల్ మండలంలోని అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాలు సందర్భంగా పాఠశాల ఆవరణలో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశం మరియు గ్రామంలో భారీ 'బడిబాట' ర్యాలీని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు,మెరుగైన వసతులు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో భాగంగా ఎఫ్ఆర్ఎస్ హాజరులో ఉత్తమ ఉపాధ్యాయులను, విద్యార్థులను సన్మానించారు.బడిబాట కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు,ప్రజా ప్రతినిధులు కలిసి గ్రామంలోని వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు."సర్కారు బడి-చదువుల గుడి", "బడిలో చేరుదాం - జ్ఞానాన్ని పొందుదాం" అంటూ నినాదాలు చేస్తూ విద్యార్థులను బడికి పంపాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.అనంతరం సర్పంచ్ గౌతమి వెంకటేష్ మాట్లాడుతూ గ్రామంలో చదువుకు అర్హులైన ప్రతి బిడ్డ బడిలో ఉండాలని, పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వినయ్ కుమార్,వార్డు సభ్యులు,పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు,తల్లిదండ్రులు, సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రగతిపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఏఏపిసి చైర్మన్ అంజలి, ఉపాధ్యాయులు రాజేందర్, వసంతరావు, రవికుమార్, రతిలాల్, రాజశేఖర్, జీవన్ రెడ్డి, వెంకట బాలమురళి కృష్ణ, ప్రసాద్,మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నందీశ్వరస్వామివారికి విశేషపూజలు



**నంద్యాల జిల్లా శ్రీశైలం మే 14 (ప్రజావాణి):**ఈ రోజు ( 14.05.2026) ఉదయానికి త్రయోదశి ఘడియలు రావడంతో నందీశ్వరస్వామి వారికి పరోక్షసేవగా విశేషార్చన జరిపించబడుతుంది.ప్రతీ మంగళవారం రోజున మరియు త్రయోదశిరోజులలో దేవస్థానసేవగా (సర్కారీసేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది.అయితే ప్రతి నెలలో కూడా త్రయోదశి రోజులలో అనగా శుద్ధ త్రయోదశి మరియు బహుళ త్రయోదశి రోజులలో భక్తులు నందీశ్వరస్వామివారి పూజను పరోక్షసేవగా జరిపించుకునే అవకాశం కూడా కల్పించబడింది. కాగా ఈ రోజు మొత్తం 34 మంది భక్తులు పరోక్షసేవగా ఈ నందీశ్వరస్వామి విశేషపూజను జరిపించుకుంటున్నారు.ఈ పరోక్షసేవలో తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా, న్యూఢిల్లీతో పాటు ఆస్ట్రేలియా నుంచి కూడా భక్తులు ఈ విశేషపూజను నిర్వహించుకుంటున్నారు.ఈ విశేషార్చనలో ముందుగా లోకక్షేమాన్ని కాంక్షిస్తూ దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరిత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు, వేదపండితులు సంకల్పాన్ని చెప్పడం జరుగుతోంది.అనంతరం కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకుమహాగణపతిపూజను జరిపించబడుతోంది. ఆ తరువాత నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతోనూ,ఫలోదకాలతో హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, భస్మోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పోదకం, సువర్ణోదకం మరియు మల్లికాగుండంలోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహిస్తారు. తరువాత నందీశ్వరస్వామికి అన్నాభిషేకం నిర్వహించబడుతుంది.వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని చేయడం జరుగుతుంది. తరువాత నందీశ్వరస్వామివారికి నూతనవస్త్ర సమర్పణ, విశేషపుష్పార్చనలను చేస్తారు. అనంతరం నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించడం జరుగుతుంది.కాగా త్రయోదశి రోజున జరిపించబడే నందీశ్వరస్వామివారి పరోక్షసేవకు భక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ.1,116/-లను సేవారుసుముగా చెల్లించాల్సి ఉంటుంది.భక్తులు సేవారుసుమును www.srisailadevasthanam.org లేదా aptemples.ap.gov.in ద్వారా చెల్లింపు చేయవచ్చు.నందీశ్వరస్వామివారి ఆరాధన వలన సంతానంలేనివారికి సంతానం కలుగుతుందని, సమస్యలు తొలగి సుఖసంతోషాలు కలుగుతాయని, ఋణబాధలు తీరుతాయని, అనారోగ్యం తొలగి ఆరోగ్యం చేకూరుతుందని, కష్టాలు నివారించబడతాయని, మానసిక ప్రశాంతత చేకూరుతుందని పండితులు పేర్కొంటున్నారు.అదేవిధంగా ఈ స్వామికి నానబెట్టినశనగలను సమర్పించడం వలన కోరిన కోరికలు నెరవేరుతాయని చెప్పబడుతోంది. అందుకే ఈ స్వామివారికి శనగలబసవన్న అనే పేరు కూడా ప్రసిద్ధంగా ఉంది.ఈ పరోక్షసేవ ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించేందుకు వీలుగా ప్రసార వివరాలు, ప్రసారాల సమయం మొదలైనవాటిని ఎప్పటికప్పుడు సేవాకర్తలకు తెలియజేయడం జరుగుతున్నది.సేవాకర్తలేకాకుండా భక్తులందరు కూడా వీటిని శ్రీశైలటి.వి / యూ ట్యూబ్ ద్వారా వీక్షించవచ్చును. కావున భక్తులందరు కూడా ఈ పరోక్షసేవను సద్వినియోగం చేసుకోవాలని కోరుకుంటున్నాము.
ఇతర వివరములకు దేవస్థానం సమాచార కేంద్ర ఫోన్ నంబర్లు 83339 01351 / 52 / 53 లను సంప్రదించవచ్చును.

# ప్రజా ప్రభుత్వంలో నెరవేరిన పేదోడి సొంతింటి కల

- ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య
- హాజరైన జిల్లా గ్రంధాలయాల సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి





**షాబాద్, మే14( ప్రజావాణి )**షాబాద్ మండలంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా పోతుగల్ గ్రామంలో చంద్రకళ పాండు,మల్లారెడ్డిగూడ గ్రామంలో దొడ్డికాడి నవనీత కుమార్, చందనవెల్లి గ్రామంలో ప్రేమలత యాదయ్య నూతనంగా నిర్మించిన ఇళ్లను రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం తోనే పేదింటి ప్రజలు కలలు సాధ్యం అవుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్దార్ నగర్ మార్కెట్ చైర్మన్ సురేందర్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్పంచులు కుమార్, ప్రభాకర్ రెడ్డి, పామేన నర్సింలు, సవిత గోవర్ధన్ రెడ్డి, సవిత సుభాష్ చంద్ర, నవనీత స్వామి,శాంతమ్మ యాదయ్య, స్వరూప మహేందర్ గౌడ్ , రాజేందర్ రెడ్డి నాయకులు రవీందర్ నాయక్, మల్లారెడ్డి, చెన్నారెడ్డి, సుభాష్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, జంగయ్య, శేఖర్, ఆంజనేయులు, కాజా మీయా,మాధవ రెడ్డి, కిషోర్, రఫిక్, గౌరీశ్వర్, శశి కిరణ్ రెడ్డి, పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడితే కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ నితిక



కొమురం భీమ్ జిల్లాలో సోషల్ మీడియా వేదికలను దుర్వినియోగం చేస్తూ అసభ్యకర, కించపరిచే, విద్వేషపూరిత పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ హెచ్చరించారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఎక్స్ తదితర సామాజిక మాధ్యమాల్లో వ్యక్తులను, వర్గాలను లేదా సమాజాన్ని ఉద్దేశపూర్వకంగా కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం, అవమానకరమైన పోస్టులు, ఫోటోలు, వీడియోలు షేర్ చేయడం, స్టేటస్‌లలో పెట్టడం చట్టరీత్యా నేరమని ఆమె స్పష్టం చేశారు. కొంతమంది సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా, సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతున్నారని పేర్కొన్నారు. ఇటువంటి చర్యల వల్ల శాంతిభద్రతలకు భంగం కలిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా తప్పుడు ప్రచారాలు, అసత్య వార్తలు, మార్ఫింగ్ చేసిన ఫోటోలు, అసభ్యకర వీడియోలు, వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే కంటెంట్‌ను సోషల్ మీడియాలో ప్రచారం చేయడం తీవ్ర నేరంగా పరిగణించబడుతుందని తెలిపారు.సైబర్ నేరాలకు సంబంధించిన చట్టాల ప్రకారం నిందితులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన ఎస్పీ, సోషల్ మీడియాలో ఏదైనా పోస్టు చేయడానికి ముందు అది ఇతరులకు ఇబ్బంది కలిగిస్తుందా లేదా చట్ట విరుద్ధమా అనే విషయాన్ని తప్పనిసరిగా ఆలోచించాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, ఎలాంటి అసభ్యకర లేదా విద్వేషపూరిత పోస్టులు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సోషల్ మీడియాను సమాజ హితం కోసం బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు.

# వ్యక్తిపై దాడి ఇద్దరిపై కేసు

**చెన్నారావుపేట మే 14 ప్రజావాణి :**
మండలంలోని అమీనాబాద్‌లో బర్రెను పొలంలో మేప వద్దు అన్న విషయంలో తలెత్తిన వివాదం చిలికి చిలికి గాలివానలా మారి కొట్లాటకు దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సింగరబోయిన ఎల్లయ్య తన కుమార్తె పొలంలో బండి దిలీప్, సారయ్యలను వారి బర్రెను మేప వద్దు అని ప్రశ్నించగా, వారు ఆగ్రహంతో ఎల్లయ్యపై రాడ్డుతో దాడి చేశారని బాధితుడు ఎల్లయ్య ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.ఈ ఘటనలో ఎల్లయ్యకు తల పగిలి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బండి దిలీప్, బండి సారయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ రెడ్డి తెలిపారు.

# బాల్య వివాహం అడ్డుకొన్న అధికారులు

**మన ప్రజావాణి చొప్పదండి నియోజకవర్గం మే14 :**కొడిమ్యాల మండల పరిధి లోని బాల్య వివాహాన్నీ అధికారులు అడ్డుకున్నారు .రాజన్న సిరిసిల్ల జిల్లా కు చెందిన బాలికకు కొడిమ్యాల మండలం పరిధి గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి నిశ్చయ్యమైంది. విషయం తెలుసుకొన్న డ్యాప్యూటీ తహసీల్దార్ కాజా సెమీ హమ్మద్ మరియు ఆర్ ఐ రాజారామ్ చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ కే శ్రవణ్ చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కేసు వర్కర్ ఎ రజిత గారు .అంగన్వాడీ టీచర్స్ స్నేహ లత మరియు వసంత పోలీస్ సిబ్బంది జితేందేర్ మరియు గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ మరియు సెక్రటరీ గ్రామానికి వెళ్లారు .ఆధార్ కార్డు మరియు స్టడీ సర్టిఫికెట్ పరిశీలించారు బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. చిన్న తనం లో వివాహం చేస్తే అనర్థాలు జరుగుతాయి అని. 18 సంవత్సరాలు నిండినంతవరకు మ్యారేజ్ చేయమని అమ్మయి తల్లిదండ్రులు మరియు అబ్బాయి తల్లిదండ్రులు అంగీకార పత్రం వ్రాయించి ఇవ్వడంతో అధికారులు వెళ్లిపోయారు.

# ఆకట్టుకున్న దుర్యోధన వధ.



**బంగారుపాళ్యం మే 14 ప్రజావాణి :** బంగారుపాళ్యం మండలంలోని చికూరుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం నందు గత నెల 24వ తేదీ నుంచి మహాభారత యజ్ఞంలో గురువారం 18వ రోజు దుర్యోధనుని ప్రతిమ చుట్టూ దుర్యోధన భీమసేన పాత్రధారులు తమ పద్యాలు పాటలతో అలరించారు. అనంతరం దుర్యోధన వధ దుర్యోధన బొమ్మ మట్టి కోసం భక్తులు ఎగబడ్డారు. ఈ కార్యక్రమంలో చికూరుపల్లి కేజీ సత్రం సి ఆర్ కాలనీ, లక్ష్మీ నగర్ కాలనీ, పామని వాండ్ల ఊరు, కల్లూరుపల్లి, కాటప్ప గారి పల్లి, మరియు చుట్టుపక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామదేవతల ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనుబాబు



**మంథని నియోజకవర్గం, మే 14, ప్రజావాణి:**మంథని మండలం సూరయ్యపల్లి గ్రామంలో గ్రామ దేవతల ప్రతిష్ట కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు పాల్గొన్నారు.భూలక్ష్మి మహాలక్ష్మి సహిత బొడ్రాయి, పెద్దమ్మ తల్లి, పోచమ్మ అమ్మవార్ల ఆశీస్సులు తీసుకున్నారు. మంథని మండలంలోని సూరయ్యపల్లి గ్రామంలో నిర్వహించిన భూలక్ష్మి మహాలక్ష్మి సహిత బొడ్రాయి స్థిర ప్రతిష్ట, పెద్దమ్మ తల్లి, పోచమ్మ కొలుపు మహోత్సవ కార్యక్రమంలో సైతం టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన దుద్దిళ్ల శ్రీను బాబు గ్రామ దేవతల ఆశీస్సులు తీసుకుని గ్రామ ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పంటల సమృద్ధి కోసం ప్రార్థనలు చేశారు.అలాగే గ్రామ దేవతల పూజలు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో ఐక్యతను, భక్తి భావాన్ని పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన చేసిన

- మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్





**జమ్మికుంట మే 14 (ప్రజావాణి):**జమ్మికుంట పట్టణ పరిధిలోని ఎంప్లాయిస్ కాలనీకి చెందిన నాయినేనీ లక్ష్మీ 16వ వార్డుకు చెందిన మల్లెపు స్వప్న కు ముఖ్యమంత్రి సహాయనిది అందజేసిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ ఫిరోజ్,కుతడి తిరుపతిచందా రాజు తదితరులు పాల్గొన్నారు

# కోహ్లీ అరుదైన రికార్డు

ఐపీఎల్ 2026 సీజన్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఒక అద్భుతమైన మైలురాయిని చేరుకున్నాడు. బుధవారం రాయ్‌పూర్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్ తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తుది జట్టులో చోటు దక్కించుకోవడంతో కోహ్లీ ఈ అరుదైన ఘనత సాధించాడు. ఇది విరాట్ కోహ్లీకి ఐపీఎల్ కెరీర్‌లో 279వ మ్యాచ్. దీనితో లీగ్ చరిత్రలోనే అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా కోహ్లీ రికార్డు పుస్తకాల్లోకి ఎక్కాడు. గతంలో ఈ రికార్డు మహేంద్ర సింగ్ ధోనీ, రోహిత్ శర్మ పేరు మీద ఉండేది. వీరిద్దరూ తలో 278 మ్యాచ్‌లతో కోహ్లీతో సమానంగా ఉండగా, తాజా మ్యాచ్‌తో విరాట్ అందరికంటే ముందు వరుసలో నిలిచాడు. ఐపీఎల్ అంటేనే రికార్డుల వేదిక, అలాంటిది ఈ మెగా టోర్నీలో మోస్ట్ క్యాప్డ్ ప్లేయర్‌గా నిలవడం సామాన్యం కాదు. ఎంఎస్ ధోనీ ప్రస్తుతం చెన్నై సూపర్ కింగ్స్ స్క్వాడ్‌లో ఉన్నప్పటికీ ఈ సీజన్‌లో ఇంకా మైదానంలోకి దిగలేదు. మరోవైపు రోహిత్ శర్మ ముంబై ఇండియన్స్ తరపున ఆడుతున్నాడు. వీరిద్దరినీ వెనక్కి నెట్టి విరాట్ కోహ్లీ ఈ సరికొత్త శిఖరాన్ని చేరుకున్నాడు. రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ కోహ్లీ కెరీర్‌లో చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. కేవలం ఒకే ఫ్రాంచైజీ తరపున ఇన్ని మ్యాచ్‌లు ఆడటం కోహ్లీ అంకితభావానికి నిదర్శనం అని క్రికెట్ విశ్లేషకులు కొనియాడుతున్నారు. ఈ కీలక మ్యాచ్‌లో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. పిచ్ పరిస్థితిని బట్టి చూస్తే రెండో ఇన్నింగ్స్‌లో బౌన్స్ మారే అవకాశం ఉందని, అందుకే ప్రత్యర్థిని తక్కువ పరుగులకే కట్టడి చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు పాటిదార్ తెలిపాడు. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఆర్సీబీ 11 మ్యాచ్‌ల్లో 7 విజయాలతో రెండో స్థానంలో ఉంది. గత మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై ఉత్కంఠభరిత విజయం సాధించిన బెంగళూరు టీమ్, అదే జోరును కొనసాగించి ప్లేఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకోవాలని పట్టుదలతో ఉంది. జట్టులోని ఆటగాళ్లందరూ మంచి ఫామ్‌లో ఉండటం ఆర్సీబీకి ప్లస్ పాయింట్ అవుతోంది. మరోవైపు కోల్‌కతా నైట్ రైడర్స్



కెప్టెన్ అజింక్య రహానే కూడా తమకు బౌలింగ్ చేయడమే ఇష్టమని చెప్పాడు. కేకేఆర్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో ఉన్నప్పటికీ, గత నాలుగు మ్యాచ్‌ల్లో వరుస విజయాలతో దూసుకుపోతోంది. సీజన్ ఆరంభంలో తడబడిన త్రీ-టైమ్ ఛాంపియన్స్, ఇప్పుడు సరైన టైమింగ్‌లో పుంజుకున్నారు. ప్రతి మ్యాచ్‌ను ఒక్కో అడుగుగా భావిస్తూ సింపుల్‌గా ప్లాన్ చేస్తున్నామని రహానే తెలిపాడు. ప్లేఆఫ్స్ రేసులో ఉండాలంటే కేకేఆర్‌కు ఈ మ్యాచ్ గెలవడం చాలా ముఖ్యం. విరాట్ కోహ్లీ రికార్డు సృష్టించిన ఈ మ్యాచ్‌లో గెలిచి తమ విజయ పరంపరను ఐదుకు పెంచాలని కోల్‌కతా చూస్తోంది.



## శార్దూల్ బంతికి బిత్తరపోయిన శ్రేయస్ అయ్యర్

ధర్మశాల స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ ధాటిగా ఇన్నింగ్స్ ప్రారంభించింది. 11 ఓవర్లు ముగిసేసరికి పంజాబ్ ఒక వికెట్ నష్టానికి 107 పరుగులు చేసి పటిష్ట స్థితిలో ఉంది. ఈ దశలో ముంబై తాత్కాలిక కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా, 12వ ఓవర్ వేసే బాధ్యతను శార్దూల్ ఠాకూర్‌కు అప్పగించాడు. ఆ ఓవర్ రెండో బంతికే సెంచరీ దిశగా సాగుతున్న ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌ను అవుట్ చేసిన శార్దూల్, ముంబైకి బ్రేక్ ఇచ్చాడు. ప్రభ్‌సిమ్రాన్ అవుట్ అయిన తర్వాత క్రీజులోకి వచ్చిన పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ఎదుర్కొన్న మొదటి బంతికే ఫోర్ కొట్టి శుభారంభం చేశాడు. అయితే ఆ మరుసటి బంతికే శార్దూల్ ఒక అద్భుతాన్ని సృష్టించాడు. గుడ్ లెంగ్త్‌లో పడిన బంతి అనూహ్యంగా స్వింగ్ అవుతూ ఆఫ్ స్టంప్‌ను గిరాటేసింది. ఆ బంతిని అంచనా వేయడంలో అయ్యర్ పూర్తిగా విఫలమయ్యాడు. బంతి వెళ్లిన వేగానికి, ఆ స్వింగ్‌కు అయ్యర్ నోరెళ్లబెట్టాడు. కనీసం బంతి ఎటు నుంచి వచ్చిందో కూడా అర్థం కాక అయోమయంలో ఉండిపోయాడు.అయ్యర్ వికెట్ తీసిన వెంటనే శార్దూల్ ఆనందానికి అవధులు లేవు. మైదానంలో పరుగెత్తుతూ తనదైన శైలిలో సంబరాలు చేసుకున్నాడు. ఒకే ఓవర్లో ఇద్దరు కీలక బ్యాటర్లను అవుట్ చేసి పంజాబ్‌ను కష్టాల్లోకి నెట్టాడు. ఈ వీడియో ఇప్పుడు క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. నెటిజన్లు దీనిని "సీజన్ ఉత్తమ బంతి"గా అభివర్ణిస్తున్నారు. కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో శార్దూల్ చేసిన ఈ ప్రయోగం ముంబై జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపింది.మంచి ఆరంభం లభించినా, శార్దూల్ వేసిన ఆ ఒక్క ఓవర్ పంజాబ్ స్కోరు వేగాన్ని తగ్గించింది. కెప్టెన్ అయ్యర్ తక్కువ పరుగులకే వెనుదిరగడం జట్టుపై ఒత్తిడి పెంచింది. బుమ్రా వ్యూహం పారడంతో ముంబై ఇండియన్స్ మ్యాచ్‌పై పట్టు సాధించింది. ఈ అద్భుతమైన డెలివరీ ఐపీఎల్ చరిత్రలో ఒక ప్రత్యేకమైన వికెట్‌గా నిలిచిపోతుందనడంలో సందేహం లేదు.

## 2026 ట్రై సిరీస్‌కు భారత జట్టును ప్రకటించిన బీసీసీఐ

**• టీమ్ఇండియాలోకి వైభవ్ సూర్యవంశీ ఎంపిక • కెప్టెన్‌గా తిలక్ వర్మ, వైస్ కెప్టెన్‌గా రియాన్ పరాగ్**

రాజస్థాన్ రాయల్స్ చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీకి టీమ్ఇండియా పిలుపు అందింది. సెలక్టర్లు అతడిని భారత జాతీయ జట్టులోకి తీసుకున్నారు. ప్రస్తుతం క్రికెట్ లవర్స్ ఐపీఎల్ ఎంజాయ్ చేస్తున్న వేళ బీసీసీఐ మరో కీలక సిరీస్‌కు భారత్- ఏ జట్టును ప్రకటించింది. వచ్చే నెల శ్రీలంక, అఫ్గానిస్థాన్ జట్లతో జరగనున్న ట్రై సిరీస్‌కు 15 మందితో కూడిన జట్టును వెల్లడించింది. ఈ జట్టుకు తిలక్ వర్మ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. రియాన్ పరాగ్ వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.



ఈ సిరీస్‌కు వైభవ్‌ను కూడా ఎంపిక చేశారు.వైభవ్‌తోపాటు పంజాబ్ కింగ్స్ ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్, ఆయుశ్ బదోనీ, విప్రజ్ నిగమ్, హర్ష్ దూబే, యశ్ ఠాకూర్, హర్ష్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, అర్షద్ ఖాన్ తొలిసారి టీమ్ఇండియా పిలుపు అందుకున్నారు. ఈ జట్టులో దాదాపు ప్రస్తుత ఐపీఎల్‌లో అదరగొడుతున్న ఆటగాళ్లకే సెలక్టర్లు ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే ఈ సిరీస్‌తో వైభవ్‌ను ఎప్పుడెప్పుడు టీమ్ఇండియా జట్టులో చూద్దామా అనుకున్న ప్రేక్షకుల ఎదురుచూపులకు తెరపడినట్లు అయ్యింది! మరి మన కుర్రాళ్లు ఎంతవరకు ఆకట్టుకుంటారో చూడాలి.కాగా, భారత్- శ్రీలంక- అఫ్గానిస్థాన్ జట్లు తలపడనున్న ఈ సిరీస్‌ను వన్డే ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. శ్రీలంక వేదికగా జూన్ 09న సిరీస్ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ లో ఆతిథ్య శ్రీలంకతో భారత్ తలపడనుంది. ఒక్కో జట్టు ఈ సిరీస్‌లో నాలుగేసి మ్యాచ్‌లు ఆడుతుంది. టాప్ 2లో నిలిచిన రెండు జట్లు టైటిల్ ఫైట్‌లో పాల్గొంటాయి. జూన్ 21న ఫైనల్ మ్యాచ్ ఉండనుంది.



## పవర్‌ప్లేలో నయా రికార్డు సృష్టించిన రబాడ

ఐపీఎల్ 2026 సీజన్‌లో సౌతాఫ్రికా స్పీడ్‌స్టర్ కగిసో రబడ తన ప్రతాపాన్ని కొనసాగిస్తున్నాడు. అహ్మదాబాద్ వేదికగా మంగళవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో రబడ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో ప్రత్యర్థి టాప్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. ఈ మ్యాచ్‌లో తన కోటా 4 ఓవర్లలో కేవలం 28 పరుగులు మాత్రమే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. ముఖ్యంగా కొత్త బంతితో రబడ వేసిన స్పెల్ ఈ సీజన్‌లోనే అత్యంత ప్రమాదకరమైనదిగా నిలిచింది. పవర్‌ప్లేలోనే అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, స్మరణ్ రవిచంద్రన్ వంటి కీలక బ్యాటర్లను పెవిలియన్ పంపి హైదరాబాద్ టీమ్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. ఈ అదిరిపోయే ప్రదర్శనతో రబడ ఐపీఎల్ చరిత్రలో ఒక అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. ఈ సీజన్ పవర్‌ప్లే ఓవర్లలో రబడ ఇప్పటివరకు మొత్తం 16 వికెట్లు సాధించాడు. తద్వారా ఒకే ఐపీఎల్ సీజన్ పవర్‌ప్లేలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో మిచెల్ జాన్సన్ (2013), ట్రెంట్ బౌల్ట్ (2020) రికార్డులను సమం చేశాడు. ప్రస్తుతం రబడ కంటే ముందు కేవలం మహమ్మద్ షమీ మాత్రమే ఉన్నాడు. షమీ 2023 సీజన్‌లో పవర్‌ప్లేలో 17 వికెట్లు పడగొట్టి టాప్‌లో ఉన్నాడు. రబడ ప్రస్తుత ఫామ్ చూస్తుంటే ఈ రికార్డును బ్రేక్ చేయడం పెద్ద కష్టమేమీ కాదనిపిస్తోంది.ప్రస్తుత 2026 సీజన్ పవర్‌ప్లే వికెట్ల చార్ట్‌లో కూడా రబడ అందరికంటే చాలా ముందున్నాడు. రబడ 16 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా, భువనేశ్వర్ కుమార్ 12 వికెట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. జోఫ్రా ఆర్చర్, మహమ్మద్ సిరాజ్ చెరో 9 వికెట్లతో తర్వాత స్థానాల్లో ఉన్నారు. రబడ ఎకానమీ కొంచెం ఎక్కువగా ఉన్నప్పటికీ, వికెట్లు తీయడంలో మాత్రం తనదైన మార్క్ చూపిస్తున్నాడు. వికెట్లు తీయడం వల్ల ప్రత్యర్థి టీమ్ రన్ రేట్‌ను కంట్రోల్ చేయడంలో రబడ సక్సెస్ అవుతున్నాడు.ఈ మ్యాచ్‌లో రబడ దెబ్బకు సన్‌రైజర్స్ బ్యాటర్లు క్రీజులో నిలదొక్కుకోవడానికి చాలా ఇబ్బంది పడ్డారు. పవర్‌ప్లే ముగిసేసరికి హైదరాబాద్ స్కోరు కేవలం 34/4 మాత్రమే. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్‌కు ఇది రెండో అత్యల్ప పవర్‌ప్లే స్కోరు కావడం గమనార్హం. అలాగే పవర్‌ప్లేలోనే 4 వికెట్లు కోల్పోవడం హైదరాబాద్ టీమ్‌కు ఈ సీజన్‌లో ఇదే మొదటిసారి. అంతకుముందు గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్ హాఫ్ సెంచరీలతో రాణించి తమ జట్టుకు 168 పరుగుల గౌరవప్రదమైన స్కోరు అందించారు. ఆ తర్వాత టార్గెట్ ఛేజింగ్‌లో సన్‌రైజర్స్ సెటిల్ అవ్వకుండా రబడ ఆరంభం నుండే ఒత్తిడి పెంచాడు.ముందుగా అభిషేక్ శర్మను ఎక్స్‌ట్రా పేస్ ఇంకా బౌన్స్‌తో అవుట్ చేసిన రబడ, ఆ వెంటనే ఇషాన్ కిషన్‌ను తన ట్రాప్‌లో పడేసాడు. తన స్పెల్ మధ్యలో స్మరణ్ రవిచంద్రన్‌ను కూడా అవుట్ చేసి హైదరాబాద్ అగ్రెసివ్ బ్యాటింగ్ లైనప్‌ను కకావికలం చేసాడు. ఈ సీజన్ అంతటా రబడ తన రా పేస్, అక్యురేట్ లెంగ్త్స్ తో బ్యాటర్లను భయపెడుతున్నాడు. పిచ్ ఎలాంటిదైనా సరే తన బౌలింగ్‌తో వికెట్లు రాబట్టడం రబడకు వెన్నతో పెట్టిన విద్య. గుజరాత్ టైటాన్స్ దగ్గర ఐపీఎల్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ పేస్ అటాక్ ఎందుకు ఉందో రబడ మరోసారి నిరూపించాడు.

### విమర్శకుల నోర్లు మూయించిన
## ప్రభ్‌సిమ్రాన్ సింగ్



ఈ ఐపీఎల్ సీజన్ మధ్యలో ప్రభ్‌సిమ్రాన్ సింగ్ సుమారు 10 కిలోల బరువు పెరిగాడని, దాని వల్ల ఆయన క్రీజులో చురుగ్గా కదలలేకపోతున్నారని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. గత మూడు ఇన్నింగ్స్‌ల్లో విఫలం కావడంతో ఈ విమర్శలు మరింత ఎక్కువయ్యాయి. అయితే ముంబై ఇండియన్స్‌తో జరిగిన పోరులో ఆయన తన అసాధారణ క్లాస్ ప్రదర్శించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. బరువు పెరిగారన్న వారికి తన పరుగుల వేగంతోనే గట్టి జవాబు ఇచ్చాడు.ధర్మశాల స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో ప్రభ్‌సిమ్రాన్ సింగ్ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 32 బంతుల్లోనే 57 పరుగులు సాధించి ముంబై బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. ఈ ఇన్నింగ్స్‌లో మొత్తం 10 బౌండరీలు (6 ఫోర్లు, 4 సిక్సర్లు) బాదాడు. 178.12 స్ట్రైక్ రేటుతో సాగిన ఈ మెరుపు ఇన్నింగ్స్ ప్రస్తుత సీజన్‌లో ఆయనకు ఐదవ అర్ధ సెంచరీ కావడం విశేషం. స్టాండ్స్‌లో కూర్చున్న పంజాబ్ కింగ్స్ యజమాని ప్రీతి జింటా, ప్రభ్‌సిమ్రాన్ షాట్లకు ముగ్ధురాలై నిలబడి చప్పట్లతో అభినందించాడు.ప్రభ్‌సిమ్రాన్ ఈ భారీ ఇన్నింగ్స్ ఆడటంలో అదృష్టం కూడా కీలక పాత్ర పోషించింది. ఈ మ్యాచ్‌లో ఆయనకు రెండుసార్లు లైఫ్ లభించింది. వ్యక్తిగత స్కోరు 5 పరుగుల వద్ద ఉన్నప్పుడు నమన్ ధీర్ క్యాచ్ జారవిడచగా, 28 పరుగుల వద్ద కార్బిన్ బాష్ మరో క్యాచ్ వదిలేశాడు. ఈ అవకాశాలను చక్కగా వినియోగించుకున్న ప్రభ్‌సిమ్రాన్, పంజాబ్ జట్టుకు బలమైన పునాది వేశాడు. ఈ ఇన్నింగ్స్‌తో ప్రభ్‌సిమ్రాన్ సింగ్ ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ తరపున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు 12 మ్యాచ్‌లలో 43.90 సగటుతో 439 పరుగులు సాధించాడు. ముఖ్యంగా 170.15 స్ట్రైక్ రేటుతో పరుగులు రాబడుతూ జట్టుకు మెరుపు ఆరంభాలను అందిస్తున్నాడు.కీలక సమయంలో ప్రభ్‌సిమ్రాన్ ఫామ్‌లోకి రావడం పంజాబ్ జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపింది. విమర్శలను పట్టించుకోకుండా తన పని తాను చేసుకుపోతే విజయం వరిస్తుందని ఆయన నిరూపించాడు.



## సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేఆఫ్స్ చేరాలంటే ..

ఐపీఎల్ 2026లో భాగంగా అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చిత్తు చిత్తుగా ఓడిపోయిన సంగతి తెలిసిందే. 82 పరుగుల తేడాతో ఘోర ఓటమిని చవిచూసింది. ఫలితంగా ఎస్ఆర్‌హెచ్ నెట్‌రన్‌రేటు (౦0.331) దారుణంగా పడిపోయింది. ఈ ఓటమితో పాయింట్ల పట్టికలో ప్రస్తుతానికి సన్‌రైజర్స్ హైదరాబాద్ స్థానం మారకున్నా కూడా ప్లేఆఫ్స్ అవకాశాలు మాత్రం కొద్దిగా కష్టంగా మారాయి. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలవాల్సిన పరిస్థితి ఉంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు సన్‌రైజర్స్ హైదరాబాద్ 12 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 7 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. మరో 5 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ప్రస్తుతం 14 పాయింట్లతో పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతోంది. లీగ్ దశలో ఎస్ఆర్‌హెచ్ మరో రెండు మ్యాచ్‌లు మే 18న చెన్నైతో, మే22న ఆర్‌సీబీతో ఆడనుంది. అయితే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ప్లేఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకోవాలంటే.. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు మిగిలిన రెండు మ్యాచ్‌లు.. చెన్నై, ఆర్‌సీబీపై విజయం సాధించాల్సి ఉంటుంది. అప్పుడు సన్‌రైజర్స్ ఖాతాలో 18 పాయింట్లు ఉంటాయి. మెరుగైన రన్‌రేటు కలిగి ఉంటే ఇతర జట్ల సమీకరణాలు కలిసి వస్తే టాప్-2లో కూడా చోటు దక్కించుకోవచ్చు. ఇక మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ఎస్ఆర్‌హెచ్ ఒక్క మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికి కూడా ప్లేఆఫ్స్‌కు చేరుకునే అవకాశాలు ఉన్నాయి.




# కేడీ ట్రైలర్ విడుదల

ధ్రువ్ సర్జా హీరోగా ప్రేమ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కేడీ: ది డెవిల్' మే 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. సంజయ్ దత్ కీలకపాత్రలో నటించారు. తాజాగా దీని తెలుగు ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'ఇది అంతం కాదు.. ఆరంభం' అని ధ్రువ్ తన డైలాగులతో ఆకట్టుకుంటున్నారు. ఈ సినిమాలోని ఓ పాట పలు వివాదాలకు కారణమైన విషయం తెలిసిందే. దాన్ని అన్ని సోషల్ మీడియా వేదికల్లోనూ తొలగించారు. దీంతో తెలుగులో ఆ పాటను ఉంచుతారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది.

## కురుప్ప విడుదలకు ముందే ఇబ్బందులు

### చివరి నిముషంలో షోలు రద్దు

తమిళ స్టార్ హీరో సూర్య నటించిన తాజా చిత్రం కరుప్పు విడుదలకు ముందే అనూహ్య ఇబ్బందుల్లో చిక్కుకుంది. దర్శకుడు ఆర్జే బాలాజి తెరకెక్కించిన ఈ సినిమాను తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో విడుదల చేయాలని ప్లాన్ చేశారు. త్రిష కృష్ణన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం మే 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కావాల్సి ఉండగా.. చివరి నిమిషంలో షోలు రద్దు కావడంతో అభిమానులు నిరాశ చెందుతున్నారు.




షెడ్యూల్ ప్రకారం గురువారం ఉదయం నుంచే థియేటర్లలో షోలు ప్రారంభం కావాల్సి ఉంది. కానీ విడుదలకు ముందు ఆర్థికపరమైన చిక్కులు తలెత్తడంతో మార్నింగ్ షోలు నిలిచిపోయినట్లు సమాచారం. తమిళనాడులో ప్రత్యేక షోలకు అనుమతులు వచ్చినప్పటికీ, అవి కూడా రద్దు కావడం సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న విజయ్ ప్రభుత్వం ఉదయం 9 గంటల స్పెషల్ షోలకు పర్మిషన్ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. అయితే అన్ని ఏర్పాట్లు పూర్తయిన తర్వాత కూడా ఒక్క షో పడకపోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. బుక్‌మైషోలో ఉదయం ఆటలకు సంబంధించిన బుకింగ్స్ కనిపించకపోవడంతో పాటు, తెలుగు రాష్ట్రాల్లో కూడా పలు థియేటర్లలో మార్నింగ్ షోలు క్యాన్సిల్ అయ్యాయి. మ్యాట్నీ షోల బుకింగ్స్ కూడా రద్దు చేసినట్లు సమాచారం. ఓవర్సీస్‌లో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. అమెరికాలో ప్రీమియర్ షోలు నిలిపివేయడంతో పాటు, వీకెండ్ బుకింగ్స్‌పై కూడా అనిశ్చితి నెలకొంది. దీంతో సినిమా రిలీజ్‌పై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ పరిణామాలపై నిర్మాత ఎస్‌ఆర్ ప్రభు సోషల్ మీడియాలో స్పందించారు. 'అనివార్య కారణాల వల్ల ఉదయం 9 గంటల ప్రదర్శనలు రద్దు చేయబడ్డాయి. అందరికీ మా హృదయపూర్వక క్షమాపణలు' అంటూ ట్వీట్



## మైసా కోసం రష్మిక ప్రత్యేక ట్రైనింగ్

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆమె నటిస్తున్న యాక్షన్ డ్రామా 'మైసా'పై ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కేరళ షెడ్యూల్ పూర్తి చేసిన రష్మిక.. అక్కడి అనుభవాలను సోషల్ మీడియాలో

అభిమానులతో పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి. కొచ్చిలో జరిగిన షూటింగ్ గురించి రష్మిక చేసిన పోస్టులు ఇప్పుడు నెటింట చర్చనీయాంశంగా మారాయి. ప్రకృతి అందాలు, అడవులు, జలపాతాలు, ఎత్తైన కొండలు, వర్షాల మధ్య సాగిన షూటింగ్ తనకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవమని ఆమె వెల్లడించారు. ప్రత్యేకంగా ఎత్తైన ప్రదేశాలంటే తనకు భయం ఉన్నప్పటికీ.. 'మైసా' సినిమాలో యాక్షన్ సన్నివేశాల కోసం ఆ భయాన్ని ఎదుర్కొంటూ స్పెషల్ ట్రైనింగ్ తీసుకున్నానని రష్మిక తెలిపారు. షూటింగ్ సమయంలో అడవుల్లో ట్రెక్కింగ్, ఔట్‌డోర్ యాక్షన్ ఎపిసోడ్స్, భారీ వర్షాల మధ్య చిత్రీకరణ చాలా కష్టంగా సాగిందని చెప్పారు. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సీన్ల కోసం శారీరకంగా చాలానే శ్రమపడాల్సి వచ్చిందని రష్మిక వెల్లడించారు. మోకాళ్లు, కాళ్లకు టేపింగ్ వేసుకుని కూడా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నానని తెలిపారు. తనతో పనిచేస్తున్న యూనిట్ సభ్యులు కూడా జాగ్రత్తగా ఉండాలని తరచూ చెప్పేదాన్నని గుర్తు చేసుకున్నారు. అయితే ఈ కష్టాల మధ్య కేరళలో ఫేమస్ అయిన 'పాళమ్ పూరీ'ని మాత్రం బాగా ఎంజాయ్ చేశానంటూ సరదాగా చెప్పడం అభిమానులను ఆకట్టుకుంటోంది. అలాగే బాల్కనీలో నిలబడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న కొన్ని ఫొటోలను కూడా రష్మిక ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఆ ఫొటోల్లో ఆమె చాలా నేచురల్‌గా కనిపించడంతో అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక 'మైసా' సినిమా విషయానికి వస్తే.. దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రష్మిక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా హై ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా కోసం రష్మిక ఇప్పటికే థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేక యాక్షన్ ట్రైనింగ్ కూడా తీసుకున్నట్లు తెలిసింది. తాజాగా కేరళలో జరిగిన షెడ్యూల్‌లో కీలకమైన స్టంట్స్‌ను చిత్రీకరించినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. షెడ్యూల్ పూర్తైన సందర్భంగా యూనిట్ సభ్యులతో కలిసి తీసుకున్న వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసిన రష్మిక.. 'ఇంత కష్టపడి పనిచేసిన నా టీమ్‌కు థ్యాంక్యూ.. త్వరలో మళ్లీ సెట్స్‌లో కలుద్దాం' అంటూ ఎమోషనల్‌గా స్పందించారు.

------



## దర్శకుడిగా మారుతున్న హీరో రామ్...

23వ చిత్రంతో దర్శకుడిగా అదృష్టాన్ని పరీక్షించుకోనున్న వైనం ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని దర్శకుడిగా మారనున్నారు. 'దేవదాసు' చిత్రంతో హీరోగా రామ్ ప్రయాణం మొదలైంది. తనదైన నటన, చలాకీతనంతో, అదిరిపోయే డ్యాన్సులతో అభిమానులను సంపాదించుకున్నారు. రెండు దశాబ్దాల పాటు కెమెరా ముందు మ్యాజిక్ చేసిన రామ్ ఇప్పుడు మెగా ఫోన్ పట్టుకోనున్నారు. రామ్ హీరోగా నటిస్తున్న తదుపరి చిత్రంలో అభిమానులకు అదిరిపోయే వార్త సిద్ధమైంది.హీరోగా తన 23వ చిత్రానికి రామ్ స్వయంగా దర్శకత్వం వహించనున్నాడు. ఈ చిత్రంతో ఆయన దర్శకుడిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రకటన రేపు శుక్రవారం ఉదయం 10:08 గంటలకు అట్టహాసంగా వెలువడనుంది. తాను దర్శకుడిగా మారనున్నట్లు రామ్ రేపు అధికారికంగా ప్రకటించనున్నారు. ఇది తన డ్రీమ్ ప్రాజెక్టు కావడంతో, ఆయనే దర్శకత్వం చేయాలనుకుంటున్నారు. ఈ చిత్రానికి సంబంధించి ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ చిత్రానికి సామ్ సీఎస్ సంగీత దర్శకుడిగా వ్యవహరించనున్నారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల ఎంపిక పూర్తయ్యాక, తర్వాత రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. అభిమానులు రేపు రామ్ అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

## పెద్ది క్రేజ్ పెంచేలా ప్రమోషన్స్

### ముంబైలో ఒకటి..భోపాల్‌లో మరో ఈవెంట్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పెద్ది విడుదలకు ముందే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు సినిమాపై అంచనాలను అమాంతం పెంచగా.. ఇప్పుడు మేకర్స్ ప్రమోషన్స్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తున్నారు. 'పెద్ది' కోసం భారీ స్థాయిలో జాతీయ ప్రమోషనల్ క్యాంపెయిన్‌ను ఎ÷-లాన్ చేసినట్లు మేకర్స్ ప్రకటించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న ముంబైలో నిర్వహించే గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. ఈ ట్రైలర్ లాంచ్‌ను కేవలం సినిమా ఈవెంట్‌గా కాకుండా, పాన్ ఇండియా స్థాయిలో భారీ ప్రచార కార్యక్రమంగా మలచాలని చిత్రబృందం భావిస్తోంది. జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను ప్రత్యేకంగా ఎ÷-లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇక ట్రైలర్ లాంచ్‌తో ప్రమోషన్స్ ఆగిపోవడం లేదు. సినిమా కథలోని భారతీయ మూలాలను సెలబ్రేట్ చేసేలా మేకర్స్ మే 23న భోపాల్‌లో ప్రత్యేక సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. 'హార్ట్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన భోపాల్‌లో ఈ వేడుకను అత్యంత వైభవంగా ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ ఈవెంట్‌కు ప్రధాన ఆకర్షణగా ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ నిలవనున్నారు. 'పెద్ది' చిత్రానికి సంగీతం అందిస్తున్న రెహమాన్ స్వయంగా వేదికపై లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నారు. 'సౌండ్ ఆఫ్ పెద్ది' పేరుతో ప్రత్యేక మ్యూజికల్ ప్రెజెంటేషన్‌ను కూడా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. రెహమాన్‌తో పాటు పలువురు ప్రముఖ గాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు. ఇప్పటికే విడుదలైన 'చికిరి చికిరి', 'రైరై రారా' పాటలు సోషల్ మీడియాలో భారీ స్పందన తెచ్చుకున్నాయి. ముఖ్యంగా రామ్ చరణ్ మాస్ లుక్, ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. విడుదలైన ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు పాన్ ఇండియా స్థాయిలో రెస్పాన్స్ రావడంతో సినిమాపై భారీ హైప్ నెలకొంది. ఈ చిత్రానికి బుచ్చిబాబు సన దర్శకత్వం వహిస్తుండగా, వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.






## విరోష్ జోడీ..యాడ్‌కు విశేష స్పందన

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న జోడీ మరోసారి సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టించింది. అభిమానులు ప్రేమగా 'విరోష్' అని పిలుచుకునే ఈ జంట తాజాగా కలిసి చేసిన ఎయిర్‌బీఎన్‌బీ కపుల్ యాడ్ ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్‌లో రికార్డు స్థాయిలో స్పందన అందుకుంటోంది. ఈ యాడ్ పోస్టుకు ఇప్పటికే 9.1 మిలియన్లకు పైగా లైక్స్ రావడం విశేషం. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక లైక్స్ సాధించిన యాడ్ పోస్టుల్లో ఇది రెండో స్థానంలో నిలిచినట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఆసక్తికర విషయం ఏమిటంటే.. మొదటి స్థానంలో కూడా విజయ్-రష్మిక జంటే ఉండటం అభిమానులను మరింత ఆనందం కలిగిస్తుంది. గతంలో ఈ జంట కలిసి చేసిన మాన్యవార్ వెడ్డింగ్ క్యాంపెయిన్ యాడ్ సోషల్ మీడియాలో భారీ రికార్డులు సృష్టించింది. ఆ యాడ్ పోస్టుకు 11.5 మిలియన్లకు పైగా లైక్స్ రావడంతో పాటు 100 మిలియన్లకు పైగా వ్యూస్ దక్కాయి. అప్పట్లో అది సోషల్ మీడియాలో పెద్ద సంచలనంగా మారింది. ప్రపంచ ఫుట్‌బాల్ దిగ్గజాలు లియోనల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో కలిసి చేసిన లూయిస్ విట్టన్ యాడ్ పోస్టులతో పోలిస్తే.. విజయ్-రష్మిక యాడ్స్‌కు ఎక్కువ రెస్పాన్స్ రావడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ స్థాయి స్పందన రావడానికి ప్రధాన కారణం వీరిద్దరికీ ఉన్న భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. విజయ్ దేవరకొండ ప్రస్తుతం దర్శకుడు రవి కిరణ్ కోలా తెరకెక్కిస్తున్న 'రౌడీ జనార్ధన్' చిత్రంలో నటిస్తున్నారు. అలాగే దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ రూపొందిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'లో రష్మిక మందన్నతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇక రష్మిక మందన్న కూడా వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. బాలీవుడ్‌లో షాహిద్ కపూర్‌తో కలిసి 'కాక్‌టెయిల్ 2'లో నటిస్తుండగా, తెలుగులో 'మైసా' చిత్రంలో కనిపించనున్నారు. పాన్ ఇండియా స్థాయిలో వరుస అవకాశాలు అందుకుంటూ ఆమె కెరీర్ దూసుకెళ్తోంది.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com